ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 4
సంచిక : 79

సోమవారం 29 సెప్టెంబర్ 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD








7

# జయహో!

## ఆసియాకప్ మనదే

మ్యాచ్‌ను గెలిపించిన తెలుగు తేజం

146 పరుగులకే కుప్పకూలిన పాకిస్తాన్

ఐదు వికెట్ల తేడాతో దాయాది దేశాన్ని మట్టి కరిపించిన టీమిండియా

చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ పై అదిరే విజయం సాధించి భారత్ ఆసియా కప్ విజేతగా నిలిచింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్ పోరులో దాయాది జట్టుపై టీమ్‌ఇండియా 5 వికెట్ల తేడాతో నెగ్గింది. తొలుత బౌలర్లు విజృంభించడంతో పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తిలక్ వర్మ (69: 53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. శివమ్ దూబె (33: 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) చెలరేగాడు.



04


## స్వదేశీ ఉత్పత్తులనే కొనండి

"మన్ కీ బాత్"లో ప్రధాని మోడీ

పండుగల సీజన్ దృష్ట్యా ప్రజలు ఖాదీ వస్తువులు, స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, "వోకల్ ఫర్ లోకల్"కు మద్దతు ఇవ్వాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఆదివారం 126వ "మన్ కీ బాత్" ఎపిసోడ్ లో దేశ ప్రజలకు ప్రధాని ముఖ్యమైన సందేశం అందించారు.

## లడఖ్ ప్రజలపై ఆరెస్సెస్, బీజేపీ దాడి

- ఈ మారణ హోమాన్ని ఆపండి
- రాహుల్ గాంధీ



## ప్రపంచాన్ని ఫ్యూచర్‌సిటీకి రప్పిస్తా



- న్యూయార్క్‌లో ఉన్న వాళ్లను ఫ్యూచర్ తెప్పిస్తా
- పదేళ్లు చాన్స్‌ఇస్తే
- న్యూయార్క్, దుబాయ్ లతో పోటీ పడేలా చేస్తా
- బుల్లెట్‌రైలుపై కేంద్రాన్ని ఒప్పించాం
- కోర్టులకెళ్లి నష్టపోవద్దు.. అందరినీ ఆదుకుంటాం
- సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు

ప్రపంచంలో ఎవరు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చినా ఫ్యూచర్ సిటీ కార్యాలయంలోనే కూర్చుని మాట్లాడుతానని, ప్రపంచాన్ని ఇక్కడికే రప్పిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. విజయదశమి రాష్ట్ర ప్రజలకు అన్ని విజయాలను చేకూర్చాలని ఆకాంక్షించారు. కుతుబ్ షాహీలు హైదరాబాద్ నగరాన్ని నిర్మిస్తే, వైఎస్సార్, చంద్రబాబు దాన్ని కొనసాగించారని చెప్పారు. ఆ నాయకులు ఆలోచన చేశారు కాబట్టే, ఇప్పుడు ప్రపంచంతో పోటీ పడుతున్నామని, వారు మనకెందుకులే అనుకుంటే ఓఆర్ఆర్, శంషాబాద్, హైటెక్ సిటీ వచ్చేవి కాదని పేర్కొన్నారు.

### ఒక గొప్ప పనికి శ్రీకారం చుట్టినప్పుడు విమర్శలు సహజం

అంబర్‌పేటలో పునరుద్ధరించిన బతుకమ్మకుంటను ప్రారంభించిన సీఎం రేవంత్

- హైడ్రా ఏర్పాటు ఆలోచనను తొలుత చాలామంది విమర్శించారని వ్యాఖ్య
- రూ.7.15 కోట్లతో 14 ఎకరాల చెరువుకు పునరుజ్జీవం
- చెరువులు, మూసీ కబ్జాలతోనే హైదరాబాద్‌లో వరద ముప్పు అని వెల్లడి
- 2 సెం.మీ. వర్షానికే నగరం అతలాకుతలం కావడంపై ఆందోళన



2




### శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

ఈమెయిల్ పంపించిన ఆగంతకులు

క్షుణ్ణంగా తనిఖీలు చేసిన భద్రత సిబ్బంది

.. వివరాలు 2లో



### ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్ కౌంటర్

ముగ్గురు నక్సలైట్లు హతం

.. వివరాలు 2లో

### తొక్కిసలాట వెనక కుట్ర

సీబీఐ విచారణ జరిపించాలి

మద్రాస్ హైకోర్టులో టీవీకే పార్టీ పిటిషన్

.. వివరాలు 2లో

## ఆయన పులి కాదు.. నల్లమల నక్క



3

- ఆయన మాట్లాడే గలీజ్ మాటలు ఏ సీఎం అయినా మాట్లాడారా?
- కొండగల్ ప్రజలు తరిమి కొడతామంటున్నారు
- సీఎంపై కేటీఆర్ సంచలన కామెంట్స్
- పొంగులేటిపై ఈడీ చర్యలు శూన్యమని విమర్శ



## బీసీ రిజర్వేషన్‌తో ఎవరికీ నష్టం లేదు

రెండు మూడు రోజుల్లో 'స్థానిక' నోటిఫికేషన్

బీజేపీ, బీఆర్ఎస్ బురద రాజకీయాలు మానుకోవాలి : మంత్రి పొన్నం

అన్ని రాజకీయ పార్టీల మద్దతు ద్వారానే బీసీ రిజర్వేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని, 42 శాతం బీసీ రిజర్వేషన్‌తో ఎవరికి నష్టం జరగదని బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు.



2

## గ్రూప్-2 ఫలితాలు విడుదల

782 మంది అభ్యర్థులు సెలెక్ట్

కోర్టు కేసుతో ఒక్క పోస్టు పెండింగ్

రిలీజ్ చేసిన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం

ఎంపికైన వారి జాబితా వెబ్సైట్లో పెట్టిన టీజీపీఎస్సీ

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం
29 సెప్టెంబర్
2025







# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్ కౌంటర్

## ముగ్గురు నక్సలైట్లు హతం

**భద్రాచలం, సెప్టెంబర్29:** ఛత్తీస్ గఢ్, ఒడిశా బోర్డర్ కాంకేరి దాంతరీ అటవీ ప్రాంతంలో మరో ఎన్‌కౌంటర్‌జరిగింది. ఆదివారం మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్లు స్థానిక ఎస్పీ కల్యాణ్ తెలిపారు. మృతులను సర్వన్ మడ్కమ్ అలియాస్ విశ్వనాథ్, రమేశ్ అలియాస్ రాకేశ్ హేమ్లా, బసంతి కుంజామ్ అలియాస్ హడ్మేగా గుర్తించారు. సంఘటన స్థలం నుంచి భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. ఈ ముగ్గురు నక్సలైట్లపై రూ. 1.4 మిలియన్ల రివార్డులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కాంకేర్-గారియాబంద్ డీఆర్జీ, డీఎస్ఎఫ్‌బృందాలు ఆ ప్రాంతంలో విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ చర్యలో భద్రతా దళాలు, నక్సలైట్ల మధ్య తీవ్ర కాల్పులు జరిగాయి. ఎన్‌కౌంటర్ అనంతరం ఒక మహిళతో సహా ఇద్దరు నక్సలైట్ల మృతదేహాలను గుర్తించారు. దేశంలోని మావోయిజం చివరి దశలో ఉందని, వారంతాత సామాజిక జీవితంలో విలీనం కావాలని బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పిలుపునిచ్చాయి.

# తొక్కిసలాట వెనక కుట్ర

## సీబీఐ విచారణ జరిపించాలి

## మద్రాస్ హైకోర్టులో టీవీకే పార్టీ పిటిషన్

**చెన్నై, సెప్టెంబర్29:** తమిళనాడు రాష్ట్రం కరూర్లో నిన్న రాత్రి జరిగిన టీవీకే కార్నర్ మీటింగ్ లో తొక్కిసలాట ఘటన వెనుక కుట్ర కోణం ఉందని ఆ పార్టీ అధిష్ఠానం ఆరోపించింది. తొక్కిసలాటలో అమాయకులైన 39 మంది మరణించగా.. 80 మందికి పైగా క్షతగాత్రులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే దీనిపై టీవీకే పార్టీ మద్రాస్ హైకోర్టులోని మధురై బెంచ్‌ను ఆశ్రయిం చింది. ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటన కాదని, కుట్ర జరిగిందని ఆరోపిస్తూ పిటిషన్ దాఖలు చేసింది. పోలీసుల లాఠీచార్జి, జనంలో రాళ్ల దాడి జరిగిందని పేర్కొన్నది. విజయ్ రాకకు ముందు ఆ ప్రాంతంలో కరెంట్ పోవడంతో ఇరుకైన రోడ్లలో ఉన్న ప్రజల మధ్య తోపులాట జరిగిందని తెలిపింది. ఈ ఘటనపై సీబీఐ విచారణ జరిపించాలని కోరింది. పిటిషన్ను స్వీకరించిన కోర్టు రేపు విచారణ చేయనుంది. మరోవైపు టీవీకే చీఫ్ విజయ్ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆయన ఇంటిని ముట్టడించేందుకు విద్యార్థి సంఘాలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

## ఈమెయిల్ పంపించిన ఆగంతకులు

## క్షుణ్ణంగా తనిఖీలు చేసిన భద్రత సిబ్బంది

**హైదరాబాద్, సెప్టెంబర్29:** శంషాబాద్ ఎయిర్ పోర్టు బాంబు బెదిరింపు రావడం కలకలం రేపింది. గుర్తు తెలియని వ్యక్తులు ఇవాళ ఉదయం 6.23 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు ఈమెయిల్ చేశారు. దీంతో అప్రమత్తమైన భద్రతా బలగాలు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాయి. ఎయిర్ పోర్టు బిల్డింగ్ సమీపంలో బాంబులు పెట్టామని పేర్కొనడంతో బిల్డింగ్ తో పాటు పరిసరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి బాంబు లేదని నిర్ధారణకు వచ్చారు. అనంతరం శంషాబాద్ ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# గ్రూప్-2 ఫలితాలు విడుదల

## 782 మంది అభ్యర్థులు సెలెక్ట్.. కోర్టు కేసుతో ఒక్క పోస్టు పెండింగ్

## రిలీజ్ చేసిన టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం

## ఎంపికైన వారి జాబితా వెబ్సైట్లో పెట్టిన టీజీపీఎస్సీ



**హైదరాబాద్, సెప్టెంబర్29:** తెలంగాణలో నిరుద్యోగులకు ప్రభుత్వం మరో గుడ్న్యూస్ చెప్పింది. శనివారం సీఎం చేతుల మీదుగా గ్రూప్-1 ఉద్యోగార్థులకు నియామక పత్రాలు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే చాలా కాలంగా అభ్యర్థులంతా ఎదురుచూస్తున్న గ్రూప్-2 ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఆదివారం గ్రూపు-2 ఫలితాలను టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం రిలీజ్ చేశారు. మొత్తం 18 కేటగిరిలకు సంబంధించి.. ఎంపికైన వారి జాబితాను టీజీ పీఎస్సీ వెబ్‌సైట్‌లో పెట్టినట్టు పేర్కొన్నారు. మొత్తం 783 పోస్టులకుగానూ ఎంపికైన 782 మంది జాబితాను వెల్లడించింది. కోర్టు కేసుతో ఒక్క పోస్టును పెండింగ్‌పెట్టింది. కాగా, 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేసిన టీజీపీఎస్సీ.. 2024 డిసెంబరులో రాత పరీక్ష నిర్వహించింది. ఈ ఏడాది మార్చి 11న జనరల్ ర్యాంకుల జాబి తాను వెల్లడించింది. 783 పోస్టులకు గాను 1:1 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి నాలుగు దశల్లో ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను పూర్తి చేశారు. తుది ప్రక్రియ అంతా ముగియడంతో ఈ గ్రూప్-2 ఉద్యోగాలకు సంబంధించిన తుది ఫలితాలను టీజీపీఎస్సీ విడుదల చేసింది. ఫలితాల కోసం https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను చూడాలని పేర్కొంది. తర్వాత వెంటనే గ్రూప్-3 ఫలితాలు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి.

# ప్రపంచాన్ని ఫ్యూచర్‌సిటీకి రప్పిస్తా

## న్యూయార్క్‌లో ఉన్న వాళ్లను ఫ్యూచర్ తెప్పిస్తా

## పదేళ్లు చాన్స్‌ఇస్తే న్యూయార్క్ దుబాయ్‌లతో పోటీ పడేలా చేస్తా

## బుల్లెట్‌రైలుపై కేంద్రాన్ని ఒప్పించాం

## కోర్టులకెళ్లి నష్టపోవద్దు.. అందరినీ ఆదుకుంటాం

## సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు




**రంగారెడ్డి, సెప్టెంబర్28:** ఇంకెన్నాళ్లు టోక్యో, న్యూయార్క్ అంటూ గొప్పలు చెప్పుకుంటామని.. భావితరాలకూ అలాగే ఓ నగరం ఉండాలనే ఆలోచనతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం కందుకూరు మండలం మీర్‌ఖాన్ పేటలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. రావిర్యాల నుంచి ఆమన గల్ వరకు నిర్మించనున్న గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ - 1 నిర్మాణానికి కూడా భూమిపూజ చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీని అడ్డుకునేందుకు చాలామంది కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు. చేయకూడని రాద్ధాంతాలు చేస్తున్నారు. ఇక్కడ రేవంత్‌కు భూములు ఉన్నాయని, అందుకే నగరాన్ని నిర్మిస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. భూములుంటే దాచితే దాగేది కాదు. రికార్డుల్లో ఉంటాయి. అందరికీ తెలిసిపోతుంది. కుతుబ్‌షాహీలు నగరాన్ని నిర్మిస్తే.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లాంటి నాయకులు ఆలోచన చేశారు. అలాంటి వాళ్లు మాకెందుకులే అనుకుని ఉంటే ఇవాళ ఓఆర్ఆర్, శంషాబాద్‌లు ఏవీ వచ్చేవి కావు. గత అనుభవాలు పునాది కావాలి. భూముల విలువ నాకు తెలుసు. నేను ఎవరికీ అన్యాయం చేయను. చిన్న చిన్న సమస్యలుంటే పరిష్కరించుకుందాం. ఫ్యూచర్ సిటీకి స్థానికులు సహకరించాలి. ఇంకెన్నాళ్లు న్యూయార్క్, టోక్యో నగరాలంటూ మాట్లాడుకుందాం. ఎందుకు మనమే ఫ్యూచర్ సిటీ నిర్మించుకోవద్దు. నాకు పదేళ్లు అవకాశం ఇవ్వండి. న్యూయార్క్‌లో ఉన్నవాళ్లు కూడా ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చేస్తాం. బుల్లెట్ రైలు వచ్చేలా కేంద్రాన్ని ఒప్పించాం. ఫ్యూచర్ సిటీ మన కోసం కాదు.. భవిష్యత్తు తరాల కోసం అని సీఎం రేవంత్ అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీ నుంచి బందరుపోర్ట్ వరకు అమరావతి మీదుగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి సీఎం రోడ్డు మంజూరు చేయించారు. ఫ్యూచర్ సిటీ నుంచి బెంగళూరు వరకు రోడ్డు నిర్మాణం చేయనున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి అభివృద్ధి పనులు ఫ్యూచర్ సిటీ లో జరగనున్నాయి. భవిష్యత్ లో ఫ్యూచర్ సిటీ ప్రపంచానికి తలమానికం కానుంది. రేవంత్ రెడ్డి సంకల్పం త్వరితగతిన పూర్తికావాలని కోరుకుంటున్నా అని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయానికి శంకుస్థాపన చేసుకున్నాం. ప్రణాళిక బద్ధమైన నగరంగా చండీఘడ్ నిర్మించారు. అదే తరహాలో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేస్తున్నాం. వాణిజ్యం, వ్యాపారం చేసే వారికి అనుకూలంగా అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నాం. స్పోర్ట్స్ క్యాపిటల్ చేసే విధంగా క్రీడా విశ్వవిద్యాలయం అందేలా చర్యలు చేపడతాం. జీరో పోల్యూటెడ్ ప్రాంతంగా అభివృద్ధి చేస్తాం. భారత్ ఫ్యూచర్ సిటీ గా రూపుదిద్దడానికి స్థానికులు భాగస్వాములు కావాలని కోరుతున్నా అని ప్రసంగించారు.

**సింగరేణికి పది ఎకరాలు..**

తనకు పదేళ్లు అవకాశం ఇస్తే.. న్యూయార్క్, దుబాయ్‌తో పోటీ పడేలా చేస్తానని, న్యూయార్క్‌లో ఉన్న వారు కూడా ఫ్యూచర్ సిటీకి వచ్చేలా చేస్తానని సీఎం పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీని ఎందుకు పోటీగా నిర్మించకూడదని ప్రశ్నించారు. ఇక్కడి నుంచి బెంగళూరుకు కనెక్టివిటీ కల్పిస్తున్నామని, బుల్లెట్ ట్రైన్ తీసుకురావడానికి కేంద్రాన్ని ఒప్పించామని తెలిపారు. అమరావతి నుంచి చెన్నై వరకు బుల్లెట్ ట్రైన్ వస్తుందని, చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకుందామని, రాజకీయ పార్టీల ఉచ్చులో పడి కోర్టుల చుట్టూ తిరిగి నష్టపోవద్దని, అందరిని ప్రభుత్వం ఆదుకోవడానికి సిద్ధంగా ఉందని సీఎం సూచించారు. భవిష్యత్ తరాల కోసం కోసం ఫ్యూచర్ సిటీని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. రాబోయే పదేళ్లలో ప్రపంచంలో ఉండే ఫార్చ్యూన్ 500 కంపెనీలు భారత్ ఫ్యూచర్ సిటీలో ఉండాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తక్షణమే భూనిర్వాసితుల సమస్యలను పరి ష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్నట్టు సీఎం తెలిపారు. డిసెంబర్ నెలలో ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ భవనం, స్కిల్ యూనివర్సిటీని పూర్తి చేస్తామన్నారు. సింగరేణి కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణా నికి ఇక్కడ పది ఎకరాలు కేటాయించాలని డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్ బాబులకు సూచించారు.

# ఒక గొప్ప పనికి శ్రీకారం చుట్టినప్పుడు విమర్శలు సహజం

## అంబర్‌పేటలో పునరుద్ధరించిన బతుకమ్మకుంటను ప్రారంభించిన సీఎం రేవంత్

## హైడ్రా ఏర్పాటు ఆలోచనను తొలుత చాలామంది విమర్శించారని వ్యాఖ్య

## రూ.7.15 కోట్లతో 14 ఎకరాల చెరువుకు పునరుజ్జీవం

## చెరువులు, మూసీ కబ్జాలతోనే హైదరాబాద్‌లో వరద ముప్పు అని వెల్లడి

## 2 సెం.మీ. వర్షానికే నగరం అతలాకుతలం కావడంపై ఆందోళన



**హైదరాబాద్, సెప్టెంబర్29:** ఏదైనా ఒక మంచి పనికి శ్రీకారం చుట్టినప్పుడు విమర్శలు రావడం సర్వసాధారణమని, వాటిని పట్టించుకోకుండా లక్ష్యం వైపు సాగినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నగరంలోని చెరువుల పరిరక్షణ కోసం 'హైడ్రా' (హైదరాబాద్ రోడ్స్ అండ్ బిల్డింగ్స్ అథారిటీ) ఏర్పాటు ఆలోచన చేసినప్పుడు కూడా తనపై ప్రారంభంలో విమర్శలు వచ్చాయని ఆయన గుర్తుచేశారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని, అంబర్‌పేటలో సుదీర్ఘకాలం కబ్జాలకు గురై కనుమరుగైన బతుకమ్మకుంటను పునరుద్ధరించిన తర్వాత ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. ఒకప్పుడు ఆనవాళు కూడా లేకుండా పోయిన బతుకమ్మకుంటను తిరిగి పునరుద్ధరించడం ఒక గొప్ప మైలురాయి అని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. రూ.7.15 కోట్ల వ్యయంతో 14.16 ఎకరాల విస్తీర్ణంలో హైడ్రా చేపట్టిన పనులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి బతుకమ్మలతో హాజరైన స్థానిక మహిళలు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైడ్రా రూపొందించిన ప్రత్యేక గీతాన్ని సీఎం ఆవిష్కరించారు.

**చిన్న వర్షానికే నగరం అస్తవ్యస్తం**

మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల నగరంలో అకస్మాత్తుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. "హైదరాబాద్‌లో కేవలం 2 సెంటీమీటర్ల వర్షం పడితేనే నగరం అస్తవ్యస్తంగా మారుతోంది. దీనికి ప్రధాన కారణం చెరువులు, నాలాలు కబ్జాకు గురికావడమే. ఒకప్పుడు హైదరాబాద్‌కు చెరువులు, మూసీ నది గొప్ప వరం. కానీ ఆక్రమణల వల్ల మూసీ అంటే మురికికూపం అనేలా తయారైంది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వరద నీటిని నియంత్రించడానికి సమగ్ర ప్రణాళికలు అవసరమని, నగరంలోని సహజ వనరులను కాపాడుకోవడం ద్వారానే హైదరాబాద్ భవిష్యత్తు స్థిరంగా ఉంటుందని స్పష్టం చేశారు. బతుకమ్మకుంట పునరుద్ధరణ స్ఫూర్తితో నగరంలోని మిగతా చెరువులను కూడా కాపాడుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా పింక్ పవర్‌రన్

## బ్రెస్ట్‌క్యాన్సర్‌పై అవగాహనే లక్ష్యం

## కార్యక్రమంలో పాల్గొన్న ప్రపంచ సుందరి, ప్రముఖులు




**హైదరాబాద్, సెప్టెంబర్29 :** రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు... నెక్లెస్‌రోడ్ పీపుల్స్ ప్లాజాలో సుధారెడ్డి ఫౌండేషన్, మెయిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పింక్ పవర్ రన్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ప్రపంచ సుందరి-2025 ఓపల్ సుచాత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 3కే రన్‌లో పాల్గొని సందడి చేశారు. చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా మేఘా ఇంజినీరింగ్ ఇండిస్ట్రీస్ లిమిటెడ్ ఫౌండేషన్‌తో కలిసి సుధారెడ్డి ఫౌండేషన్ ఫౌండర్, చైర్‌పర్సన్ మేఘా సుధారెడ్డి ఈ పింక్ రన్ నిర్వహిస్తున్నారు. ఈ పింక్ పవర్ రన్ 2.0.లో నటుడు బ్రహ్మానందం పాల్గొని మాట్లాడారు. క్యాన్సర్ గురించి అవగాహన లేకపోవడం చాలా బాధకరమన్నారు నటుడు బ్రహ్మానందం.. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు. సుధారెడ్డి మాట్లాడుతూ.. గతేడాది నిర్వహించిన పింక్ పవర్ రన్ విజయవంతమైందన్నారు. హ్యాపీ వరల్డ్ ను క్రియేట్ చేయడమే లక్ష్యంగా ఈ ఏడాది కూడా పింక్ పవర్ రన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విపరీతమైన ఒత్తిడి వల్ల కూడా బ్రెస్ట్ క్యాన్సర్ వస్తుందని, దీనిపై అవగాహన కల్పిస్తూ నిర్వహిస్తున్న కార్యక్రమంలో అనేక మంది ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మేఘా కష్ణారెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, జయేష్ రంజన్, మిస్ వరల్డ్ ఓపల్ సుచాతా, నటుడు బ్రహ్మానందం, లియాండర్ పేస్ తదితరులు హాజరయ్యారు. పింక్ పవర్ రన్ 2.0లో రిజిస్టర్ చేసుకున్న పాతికవేల మంది ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
29 సెప్టెంబర్
2025





# ఆయన పులి కాదు.. నల్లమల నక్క

- ఆయన మాట్లాడే గలీజ్ మాటలు ఏ సీఎం అయినా మాట్లాడారా?
- కొండగల్ ప్రజలు తరిమి కొడతామంటున్నారు
- సీఎంపై కేటీఆర్ సంచలన కామెంట్స్
- పొంగులేటిపై ఈడీ చర్యలు శూన్యమని విమర్శ





**అచ్చంపేట, సెప్టెంబర్29:** "ఆయన నల్లమల పులి కాదు.. నల్లమల నక్క.." అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ సంచలన కామెంట్స్ చేశారు. రేవంత్ మాట్లాడే గలీజ్ మాటలు ఏ ముఖ్యమంత్రైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఓటుకి నోటు దొంగ.. 50 లక్షలతో దొరికిన దొంగ" అని చెప్పారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నల్లమల పులి అని చెప్పుకుంటారని, పాలమూరుకు చుక్క నీరు రాకుండా పోతుంటే ఆయన పిల్లిలా ఇంట్లో కూర్చోవాలా? వెళ్లి గర్జించాల్నా? అని బీఆర్ఎస్ నేత కేటీఆర్ నిలదీశారు. ఆదివారం అచ్చంపేట బీఆర్ఎస్ జనగర్జన సభలో కేటీఆర్ మాట్లాడారు. "ఆయన నల్లమల పులి కాదు.. నల్లమల్ల నక్క.. కొండగల్ ప్రజలు తరిమి కొడతామంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 8 లక్షల పెళ్లిళ్లు అయ్యాయి. ఒక్కరికి కూడా తులం బంగారం ఇవ్వలేదు. గ్రామగ్రామానికి, గడప గడపకి బాకీ కార్డ్ పంచాలి. రేవంత్ మాట్లాడే గలీజ్ మాటలు ఏ ముఖ్యమంత్రి అయినా మాట్లాడారా? రేవంత్ రెడ్డి ఓటుకి నోటు దొంగ.. 50 లక్షలతో దొరికిన దొంగ" అని చెప్పారు. "అచ్చంపేట్ వాళ్లు మా ఎమ్మెల్యే ఓడి పోతారు కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు అని అనుకున్నారు. యూరియా కోసం లైన్ లో నిలబడే పరిస్థితి వచ్చింది. పాలమూర్-రంగారెడ్డి పూర్తి చేస్తే కేసీఆర్ కి పేరు వస్తుందని పూర్తి చేయడం లేదు. రేవంత్ రెడ్డి తెల్లారితే కేసీఆర్ జపం చేస్తున్నారు. "మీకు తోడుగా ఎవరు ఉన్నా, లేకపోయినా బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం మీకు అండగా ఉంటుంది. పొంగులేటి ఇంటిపై ఈడీ రైడ్స్ చేస్తే సంవత్సరం అయినా మంత్రి, ఈడీ నోరు విప్పడం లేదు. తెలంగాణలో ఉన్నది జాయింట్ వెంచర్ ప్రభుత్వం. ముఖ్యమంత్రి పొద్దున ఒకలా, రాత్రి ఒకలా మాట్లాడుతారు. అచ్చంపేట్ నుంచే జైత్ర యాత్ర ప్రారంభం. కాంగ్రెస్ వాళ్లు ఓట్లకి వస్తే తగిన విధంగా బుద్ధి చెప్పాలి. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచవద్దని గతంలోనే పోరాటం చేశారు. కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎత్తు పెంచి కిందికి నీళ్లు రాకుండా చేస్తుంది. నల్లమల్ల పులి బిడ్డకి అడ్డుకునే దమ్ము లేదా? గులాబీ దండు వెళ్లి అడ్డుకోవాలా?" అని కేటీఆర్ అన్నారు.

## తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలంటే మళ్లీ కేసీఆర్ రావాలి

కాంగ్రెస్, బీజేపీ జాయింట్ వెంచర్ నడుపుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. మంత్రి పొంగులేటి నివాసంలో ఈడీ సోదాలు జరిగి ఏడాదైనా చర్యలు లేవన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒకటేనని, రాష్ట్ర ప్రయోజనాలను ఆ రెండు పార్టీలూ కాపడలేవని ఆరోపించారు. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి మండలం కడ్తాల్‌లో కేటీఆర్ పర్యటించారు. కడ్తాల్‌లో దీక్ష చేస్తున్న రైతులకు మద్దతు తెలిపారు. మాట ఇచ్చి.. తప్పిన కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడినంత హీనంగా ఏ సీఎం మాట్లాడలేదని అన్నారు. "రాష్ట్రం దివాళా తీసిందని సీఎం అంటే ఎవరు నమ్ముతారు? పాలమూరు, రంగారెడ్డిలో మిగిలిన 10శాతం పనులు పూర్తి చేయలేదు. ఆడబిడ్డలకు నెలకు రూ.2,500 చొప్పున రూ.55 వేలు బకాయిలు ఇవ్వాలి. ఓట్ల కోసం వచ్చిన కాంగ్రెస్ నేతలను బకాయిలపై నిలదీయాలి. ఓట్ల కోసం డబ్బులు ఇస్తే తీసుకొని.. మిగతా బకాయిల గురించి అడగాలి. ఆల్మట్టి ప్రాజెక్టును ఆపే దమ్ము రేవంత్‌రెడ్డికి ఉందా? లేదంటే గులాబీ దండు కదలాలా? ఆల్మట్టి ఎత్తు పెంపుపై రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలంటే మళ్లీ కేసీఆర్ రావాలి" అని కేటీఆర్ అన్నారు.

# డుగ్గు డుగ్గు అని..

**బైక్, సైకిల్ ర్యాలీని ప్రారంభించిన మంత్రి జూపల్లి**

**బుల్లెట్ బైక్స్‌పై ప్రత్యేక ఆకర్షణగా మహిళలు**



**హైదరాబాద్, సెప్టెంబర్29:** తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగ వేడుకల్ని ఘనంగా నిర్వహిస్తోంది. బతుకమ్మ పండుగ సంబరాలను పురస్కరించుకుని, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన ప్రత్యేక ర్యాలీ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో సైకిల్, బైక్, స్కేటింగ్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సైక్లిస్టలతో కలిసి స్వయంగా ర్యాలీలో పాల్గొన్న మంత్రి జూపల్లి, యువతలో ఉత్సాహాన్ని మరింత పెంచారు. ర్యాలీ ఎల్బీ స్టేడియం నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు సాగింది. హైదరాబాద్‌కు చెందిన విమెన్ బైకర్స్ సంప్రదాయ వస్త్రధారణతో బుల్లెట్ బైక్స్‌పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, రాష్ట్ర టూరిజం అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ స్టేడియంలో ముగిసిన ర్యాలీలో పాల్గొన్న రైడర్లకు మంత్రి జూపల్లి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ క్రాంతి వల్లూరు, ఇతర అధికారులు, విద్యార్థులు, పర్యాటక ప్రేమికులు పాల్గొన్నారు. ఈ బైక్, సైకిల్ ర్యాలీ ద్వారా పర్యాటకం, సాంస్కృతిక వారసత్వంలపై అవగాహన పెంపొందించడం, బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను యువతతో పంచుకోవడం ముఖ్య లక్ష్యంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించి రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయాలని మహిళా బైకర్లకు మంత్రి జూపల్లి పిలుపునిచ్చారు. మిస్ వరల్డ్ పోటీల సమయంలోనూ తెలంగాణ ప్రభుత్వం ప్రపంచం నలుమూల నుంచి వచ్చిన అందెగత్తెలను రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లింది. వారికి తెలంగాణ ప్రాముఖ్యత, పర్యాటక ప్రాంతాల విశిష్టతను వివరించి టూరిజాన్ని ప్రమోట్ చేయడం తెలిసిందే.

# బిల్లులు చెల్లించకపోవడం సిగ్గుచేటు

- వారికి దీపావళి లేకుండా చేయడం దుర్మార్గం
- సర్కార్‌పై హరీష్ రావు ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్29 : కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఆదివారం ట్వీట్ పెట్టారు. గురుకులాలకు నిత్యవసరాలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. నెలల తరబడి బిల్లులు పెండింగ్ పెడితే, గురుకులకు ఆహార పదార్థాలు ఎలా సప్లై చేస్తారు? పిల్లలకు నాణ్యమైన భోజన ఎలా అందిస్తారు? అని ప్రశ్నించారు. కల్తీ ఆహారంతో గురుకుల విద్యార్థులు ఆసుపత్రుల పాలై ప్రాణాలు వదులుతుంటే.. ప్రభుత్వానికి పట్టింపు లేకపోవడం శోచనీయం అన్నారు. గురుకుల విద్యార్థులు పస్తులు ఉండకూడదన్న బాధ్యతతో కాంట్రాక్టర్లు అప్పులు తీసుకొచ్చి మరీ భోజనాలు పెడుతున్నారని తెలిపారు. ఆ అప్పులు క్రమంగా పెరిగి, వారితో పాటు వారి కుటుంబ సభ్యులు ఆర్థిక భారంతో సతమతమవుతున్నాయని అన్నారు. సుమారు 5000 మంది సరఫరాదారులకు బతుకమ్మ, దీపావళి పండగ సంబరం లేకుండా చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. అధికారులను కలిసి బిల్లులు చెల్లించాలని గోడు వెళ్లబోసుకుంటున్నా ప్రభుత్వంలో కదలిక లేదని విమర్శించారు. ఇప్పటికైనా కళ్ళు తెరిచి ఆరు నెలలుగా ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, గురుకుల పిల్లలకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# బీసీ రిజర్వేషన్‌తో ఎవరికీ నష్టం లేదు

- రెండు మూడు రోజుల్లో 'స్థానిక' నోటిఫికేషన్
- బీజేపీ, బీఆర్ఎస్ బురద రాజకీయాలు మానుకోవాలి
- మంత్రి పొన్నం ప్రభాకర్





**మిర్యాలగూడ, సెప్టెంబర్29:** అన్ని రాజకీయ పార్టీల మద్దతు ద్వారానే బీసీ రిజర్వేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని, 42 శాతం బీసీ రిజర్వేషన్‌తో ఎవరికి నష్టం జరగదని బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలనలో భాగంగా కుల సేకరణ చేసి రాహుల్ గాంధీ చేపట్టిన ఎవరు ఎంతో వారికి అంత నినాదం పేరుతో బీసీ రిజర్వేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అందుకు అన్ని రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల మద్దతు ద్వారా రిజర్వేషన్ చేసి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపినట్లు తెలిపారు. పెరిగిన బీసీ రిజర్వేషన్ల వల్ల ఎస్టి, ఎస్సీ, ఈ బీసీ లకు ఎలాంటి అన్యాయం జరగదని అన్నారు. 50% రిజర్వేషన్ దాటవద్దని పేర్కొంటున్న పలు రాజకీయ నాయకులు ఈ బీసీ 10 శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడు ఏం చేశారని అన్నారు. బీసీ రిజర్వేషన్ పై న్యాయస్థానం ఎలాంటి తీర్పు ఇచ్చిన గౌరవిస్తామని, న్యాయస్థానం పట్ల నమ్మకం ఉందని అన్నారు. రిజర్వేషన్లను రొటేషన్ సిస్టంలో భాగంగా జనాభా ప్రాతిపదికన కల్పించారే తప్ప ఎవరి రాజకీయ ప్రమేయం లేదని పేర్కొన్నారు. రెండు మూడు రోజులలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్నట్లు తెలిపారు. టిఆర్ఎస్, బిజెపి పార్టీలు మూసి బురద రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వర్షాలు అధికంగా పడటం వలన ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ కిందికి నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. దీంతో ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని వెంటనే ప్రభుత్వం తరఫున 12 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ బురద రాజకీయాలు మానుకుని ప్రకృతి వైపరీత్యం వల్ల నష్టం వాటిల్లకుండా ప్రభుత్వానికి సహకారం అందించాలని కోరారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా నాలుగు చోట్ల ప్రత్యేక బస్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి విపత్తులు జరిగినప్పుడు ప్రజలతోపాటు అన్ని రాజకీయ పార్టీలు ప్రజల క్షేమం కోసం సహకరించాలని సూచించారు. అనంతరం మిర్యాలగూడ పట్టణంలోని బస్టాండ్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండ్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు హామీ ఇచ్చారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తదితరులున్నారు.

# ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంపు మరణ శాసనమే

**ఇక్కడి పొలాలన్నీ ఎడారిగా మారాలా?**

**నల్గొండ రైతులతో కలిసి చలో ఆల్మట్టి కార్యక్రమాన్ని చేపడతున్నాం**

**ఆల్మట్టి వద్ద జరుగుతున్న కుట్రను బహిరంగంగా ఎండగడతం**

**సీఎం రేవంత్ రెడ్డికి ఎంతసేపు కమిషన్లు, పంపకాలు తప్పితే రైతాంగ సమస్యల పై అవగాహన లేదు**

**ఇరిగేషన్ మంత్రికి సోయి లేదు.. కోమటిరెడ్డి కి అవగాహన లేదు**

**మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఫైర్**

**కాంగ్రెస్ బాకీ కార్డు ప్రజలకు పంపిణీ**





**నల్గొండ :** ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపుతో నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్నగర్, ఖమ్మం జిల్లాలకు మరణ శాసనం రాసినట్లు అవుతుందని మాజీ మంత్రి, సూర్యాపట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కృష్ణ బేసిన్ లో ఆలస్యంగా నీళ్లు వస్తున్నాయ్. ఆల్మట్టి ఎత్తు పెంచితే ఇక్కడున్న భూములు పడావు పడాల అని ప్రశ్నించారు. అధికారం కోసం హామీలిచ్చి, గద్దెనెక్కిన తర్వాత వాటిని గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై బిఆర్ఎస్ పార్టీ తీసుకొచ్చిన కాంగ్రెస్ బాకీ కార్డు ను తిప్పర్తి మండల కేంద్రం లో ఆదివారం ప్రతి ఇంటికి అందచేసిన మాజీ మంత్రి అనంతరం మీడియాతో మాట్లాడారు. అయినా ఇక్కడున్న అధికార కాంగ్రెస్ పార్టీకి సోయి లేదు. ఇది దద్దమ్మ ప్రభుత్వ మని ఆగ్రహ వ్యక్తం చేశారు. ఏది పట్టించుకోవట్లేదు. ఆల్మట్టి పెంపుగాని జరిగితే ఇక్కడ పొలాలన్నీ ఎడారిగా మారాల్సిందే. అందుకే బిఆర్ఎస్ పార్టీ తరఫున నల్గొండ రైతులతో కలిసి చలో ఆల్మట్టి కార్యక్రమాన్ని చేపడతున్నాం. ఆల్మట్టి వద్ద జరుగుతున్న కుట్రను బహిరంగంగా ఎండగడతాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎంతసేపు కమిషన్లు, పంపకాలు తప్పితే తెలంగాణ రైతాంగ సమస్యల గురించి అవగాహన లేదు. తెలంగాణ నీటి హక్కులు సాధించాలన్న సోయి లేదు. నల్గొండ జిల్లా నుంచి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉన్నాడు. ఆయనకు సోయి లేదు. ఇక కోమటిరెడ్డి వెంకటరెడ్డి కైతే నీళ్ల గురించి ఎలాంటి అవగాహన లేదని ఎద్దేవ చేశారు. అంగు ఆర్భాటాలు తప్పితే ప్రజలు, రైతులు గూర్చి గానీ ఆయనకి ఏ మాత్రం తెలియదు. ఆయన డమ్మీ మంత్రి. కేసీఆర్ నాయకత్వంలో చలో ఆల్మట్టి కార్యక్రమం చేపట్టి ఆల్మట్టి వద్ద పెంపును అడ్డుకుంటామని స్పష్టం చేశారు. రాబోయే రెండు, మూడు రోజుల్లోనే ఒక కార్యక్రమాన్ని చేపడతాం. నల్గొండ జిల్లా రైతాంగాన్ని పెద్ద ఎత్తున సమీకరించి చలో ఆల్మట్టి కార్యక్రమం చేపడతాం. పైన ఉన్నది కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వమే, కింద ఉన్నది రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు ప్రభుత్వమే, ఇక్కడున్న రేవంత్ రెడ్డి గురువుకు దక్షిణగా తెలంగాణ నీటి హక్కులను కట్టబెడుతుండు. ఎట్టి పరిస్థితుల్లో బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. ఇక కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం అడ్డగోలుగా ఇచ్చినటువంటి హామీలను అమలు చేయకుండా పచ్చి మోసం చేసింది. కాంగ్రెస్ మోసాన్ని ఎండగడుతూ ఎక్కడికక్కడ బిఆర్ఎస్ పార్టీ సైన్యం కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తుంది. ఎక్కడికెళ్లిన ప్రజలు, రైతులు, వృద్ధులు కాంగ్రెస్ పార్టీపై దుమ్మెత్తిపోస్తున్నారని విమర్శించారు. పచ్చి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీపై తీవ్ర ఆగ్రహంతో వున్నారని స్పష్టం చేశారు. సందర్భం ఏదైనా కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాత పెడతామని మాతో చెబుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమైందని ఆరోపించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
29 సెప్టెంబర్
2025




# చైనాలో భారీ అవినీతి... మాజీ మంత్రికి మరణశిక్ష...

- చైనా మాజీ వ్యవసాయ మంత్రి టాంగ్ రెన్‌జియాన్‌కు మరణశిక్ష
- రూ.334 కోట్ల అవినీతికి పాల్పడినట్లు తేల్చిన కోర్టు
- విచారణకు సహకరించడంతో రెండేళ్ల పాటు శిక్ష అమలు వాయిదా
- రాజకీయాల్లో పాల్గొనకుండా జీవితకాలం నిషేధం
- అక్రమ ఆస్తులన్నీ జప్తు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం



అవినీతిపై ఉక్కుపాదం మోపుతున్న చైనా ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. దేశ మాజీ వ్యవసాయ శాఖ మంత్రి టాంగ్ రెన్‌జియాన్‌కు మరణశిక్ష విధిస్తూ జిలిన్ ప్రావిన్స్ న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. సుమారు రూ.334 కోట్ల విలువైన లంచాలు స్వీకరించినట్లు ఆయనపై ఆరోపణలు రుజువు కావడంతో ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. అయితే, విచారణకు పూర్తిగా సహకరించినందున శిక్ష అమలును రెండేళ్ల పాటు వాయిదా వేస్తున్నట్లు కోర్టు తన తీర్పులో పేర్కొంది. వివరాల్లోకి వెళితే, టాంగ్ రెన్‌జియాన్ 2007 నుంచి 2024 మధ్య కాలంలో పలు ప్రభుత్వ ఉన్నత పదవుల్లో పనిచేశారు. ఈ సమయంలో ఆయన తన అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు తేలింది. వ్యాపార సంస్థలకు అనుకూలంగా వ్యవహరించడం, కాంట్రాక్టులు ఇప్పించడం, ఉద్యోగ నియామకాలు జరపడం వంటి పనుల కోసం భారీ మొత్తంలో లంచాలు స్వీకరించినట్లు కోర్టు నిర్ధారించింది. మొత్తం 268 మిలియన్ యువాన్ల (భారత కరెన్సీలో సుమారు రూ.334 కోట్లు) విలువైన నగదు, ఆస్తులు, ఇతర విలువైన వస్తువులను ఆయన లంచాల రూపంలో తీసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. విచారణ సమయంలో టాంగ్ తన నేరాలన్నింటినీ అంగీకరించారు. మరణశిక్షతో పాటు, టాంగ్ రెన్‌జియాన్‌పై మరిన్ని కఠిన చర్యలకు కోర్టు ఆదేశించింది. ఆయన రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనకుండా జీవితకాలం నిషేధం విధించింది. ఆయన వ్యక్తిగత ఆస్తులన్నింటినీ పూర్తిగా జప్తు చేయాలని, అవినీతి ద్వారా సంపాదించిన సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని స్పష్టం చేసింది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2012లో అధికారం చేపట్టినప్పటి నుంచి అవినీతి నిర్మూలనే లక్ష్యంగా కఠిన చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. చిన్న స్థాయి ఉద్యోగుల నుంచి అత్యున్నత స్థాయి అధికారుల వరకు అవినీతికి పాల్పడిన ఎవరినీ వదిలిపెట్టడం లేదు. టాంగ్ రెన్‌జియాన్‌పై తీసుకున్న ఈ చర్య కూడా ఆ పోరాటంలో భాగమేనని అక్కడి మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ తీర్పు చైనాలో అవినీతికి పాల్పడే వారికి గట్టి హెచ్చరికగా నిలుస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మద్యం అమ్మకాల్లో కర్ణాటక టాప్



**న్యూఢిల్లీ:** ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) అమ్మకాల్లో దక్షిణాది రాష్ట్రాలు టాప్ పొజిషన్‌లో నిలిచాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, తెలంగాణ, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలలో 23.18 కోట్ల కేసుల ఐఎంఎఫ్ఎల్ అమ్ముడుపోయింది. అంటే దేశంలో జరిగిన అమ్మకాల్లో 58 శాతం ఇక్కడే జరిగాయి. కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బెవరేజ్ కంపెనీస్ ఈ సమాచారాన్ని వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఐఎంఎఫ్ఎల్ అమ్మకాల్లో దక్షిణాది ఆధిపత్యం దాదాపు పరిపూర్ణంగా ఉంది. 58 శాతం అమ్మకాలు ఇక్కడే జరుగుతున్నాయి. మిగిలిన 42 శాతం దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరుగుతున్నది. అయితే, కర్ణాటకలో 6.88 కోట్ల కేసులు అమ్ముడుపోవడంతో ఆ రాష్ట్రం ఈ చార్టులో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. ఆ తర్వాతి స్థానంలో ఉన్న తమిళనాడులో 6.47 కోట్ల కేసులు అమ్ముడుపోయాయి.

# దూరమవుతున్న చందమామ!



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 28:** భూమి చుట్టూ ఓ నిర్దిష్ట కక్ష్యలో తిరుగుతున్న చంద్రుడు.. క్రమంగా భూమి నుంచి దూరం జరుగుతున్నాడట! చంద్రుడు ప్రతి ఏటా 3.8 సెంటీమీటర్లు భూమి నుంచి దూరంగా పోతున్నాడని పరిశోధకులు లెక్కగట్టారు. చంద్రుడిపై భూ గురుత్వాకర్షణ శక్తిలో సంభవిస్తున్న మార్పులే ఇందుకు కారణమని తేల్చారు. దీంతో చంద్రుడి కక్ష్యామార్గం 20,000 కిలోమీటర్ల వరకు తగ్గుతున్నదని, అందువల్లే భూమిపై కొన్ని ప్రాంతాల్లో సూపర్‌మూన్లు వంటివి కనిపిస్తున్నాయని సైంటిస్టులు చెబుతున్నారు.

చంద్రుడి ఆకర్షణ శక్తి.. భూమిపై ఒకవైపు 4 శాతం ఎక్కువ ఉంటున్నదని, మరోవైపు తగ్గుతున్నదని, ఇది భూమిపై కొన్ని చోట్ల సముద్రాలపై అలల శక్తిని పెంచుతున్నదని తెలిపారు. అందువల్లే న్యూయార్క్, లాస్ ఏంజెలెస్ మొదలైన చోట్ల సముద్రాలు హఠాత్తుగా వెనక్కి వెళ్లటం, మరోచోట సముద్రమట్టాలు పెరగటం వంటివి సంభవిస్తున్నాయని పరిశోధకులు గుర్తించారు.

# స్వదేశీ ఉత్పత్తులనే కొనండి

"మన్ కీ బాత్"లో ప్రధాని మోడీ



**ఢిల్లీ, సెప్టెంబర్29 :** పండుగల సీజన్ దృష్ట్యా ప్రజలు ఖాదీ వస్తువులు, స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని, "వోకల్ ఫర్ లోకల్"కు మద్దతు ఇవ్వాలని దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. ఆదివారం 126వ "మన్ కీ బాత్" ఎపిసోడ్ లో దేశ ప్రజ లకు ప్రధాని ముఖ్యమైన సందేశం అందించారు. ఆల్ ఇండియా రేడియో, దూరదర్శన్, ఇతర మాధ్యమాల ద్వారా ఆయన ఛత్ మహాపర్వాన్ని యునెస్కో "అమూల్య సాంస్కృతిక వారసత్వ" జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రస్తావించారు. అలాగే రాష్ట్రీ య స్వయంసేవక్ సంఘ్ శతాబ్దత్సవా న్ని గుర్తుచేసి, దాని సేవా చరిత్రను, విలు వలను ప్రశంసించారు. పండుగల సీజన్ దృష్ట్యా ప్రజలు ఖాదీ వస్తువులు, స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్నారు. శహీద్ భగత్ సింగ్ త్యాగాన్ని స్మరించు కుంటూ ఆయన యువతకు ప్రేరణ అని పేర్కొన్నారు. గాన కోకిల లతా మంగేశ్క రు నివాళి అర్పిస్తూ, ఆమె పాటలు దేశ ప్రజల హృదయాలను తాకాయని అ న్నారు. అంతేకాక, భారత నౌకాధికారి ణులు లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, రూకా సముద్ర యాత్రలో ప్రపంచంలోని అత్యంత దూరమైన పాయింట్ నేమో వద్ద భారత జెండాను ఊపిన విషయాన్ని గర్వంగా ప్రస్తావించారు.

# లడఖ్ ప్రజలపై ఆరెస్సెస్, బీజేపీ దాడి

- ఈ మారణ హోమాన్ని ఆపండి
- రాహుల్ గాంధీ



**న్యూ ఢిల్లీ, సెప్టెంబర్29 :** లడఖ్ ప్రజలు, వారి సంస్కృతి, సాంప్రదాయాలపై బీజేపీ, ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదివారం పేర్కొన్నారు. లడఖ్‌ను ఆరవ షెడ్యూల్ కింద చేర్చాలని డిమాండ్ చేశారు. 'లడఖ్ ప్రజలు తమ గొంతుకను వినిపించాలని భావించారు. బదులుగా బిజెపి నలుగురు యువకులను చంపి, సోనమ్ వాంగ్‌చుక్‌ను జైలులో పెట్టింది. హత్యను ఆపండి. హింసను ఆపండి.. బెదిరింపులను ఆపండి అని ఎక్స్‌లో పేర్కొన్నారు. లడఖ్‌కు ఒక గొంతుక ఇవ్వాలని, ఆరవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.

## లేహ్‌లో కొనసాగుతున్న కర్ఫ్యూ

లేహ్‌లో వరుసగా ఐదోరోజు కర్ఫ్యూ కొనసాగుతోంది. ఆంక్షల సడలింపుపై నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్ కవిందర్ గుప్తా భద్రతా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించినట్లు సంబంధిత వర్గాలు ఆదివారం ప్రకటించాయి. పగటిపూట ఆంక్షలను సడలించే అవకాశం ఉ ందని ఆ వర్గాలు తెలిపాయి. శనివారం లేహ్ పట్టణంలో మొదటిసారి దశలవారీగా 4 గంటలపాటు ఆంక్షలను సడలించారు. పట్టణంలో మొబైల్ ఇంటర్నెట్ సేవలు నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. కర్ఫ్యూ విధించిన ప్రాంతాల్లో పోలీసులు, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ సిబ్బందిని మోహరించినట్లు సమాచారం.

# భారత్‌పై నోరుపారేసుకున్న అమెరికా మంత్రి

## తమ గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్త అని హెచ్చరిక



**ఢిల్లీ, సెప్టెంబర్29:** అమెరికా వాణిజ్యశాఖ మంత్రి హెవార్డ్ లుట్నిక్ మరోసారి భారత్‌పై నోరుపారేసుకున్నారు. అమెరికాతో వాణిజ్య భాగస్వాములైన భారత్, బ్రెజిల్ వంటి దేశాలు తమ గురించి మాట్లాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వారు తమ మార్కెట్లను తెరిచి.. అమెరికా ప్రయోజనాలకు హానీ కలిగించే విధానాలను వెంటనే రద్దు చేసుకోవాలన్నారు. స్విట్జర్లాండ్, బ్రెజిల్, భారత్ వంటి దేశాలను అగ్రరాజ్యం మరింత సరిచేయాల్సిన అవసరం ఉందని ఓ ఇంటర్వ్యూలో ప్రేలాపనలు చేశారు. ఆయా దేశాలు తమతో ఆలోచించి మాట్లాడాలని అన్నారు. రష్యా ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలుపెట్టాకే భారత్ రాయితీపై రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లు పెంచిందని హెవార్డ్ లుట్నిక్ ఆరోపించారు. ఇప్పటికైనా ఎవరివైపు ఉండాలనే విషయంపై మోదీ ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. లుట్నిక్ గతంలోనూ ఇదే విధంగా భారత్‌పై నోరుపారేసుకున్నారు. భారత్, కెనడా, బ్రెజిల్ వంటి దేశాలు అమెరికాలో విక్రయాలు చేపడుతూ.. ప్రయోజనాలు పొందుతున్నారని.. కానీ, తమను మాత్రం ఆయా దేశాల్లో విక్రయాలు చేపట్టకుండా అడ్డుకుంటున్నాయని అన్నారు. ఏళ్ల తరబడి తాము ఈ సమస్యను ఎదుర్కొన్నాం కాబట్టే సుంకాలు విధించామన్నారు. తమతో వాణిజ్యం చేసే దేశాలు దీనిని అంగీకరించక తప్పదని అన్నారు. ఇరుదేశాల మధ్య సుంకాల వివాదం నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. భారత్- అమెరికా మధ్య సుంకాల వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై టారిఫ్‌లను 50 శాతానికి పెంచారు. గత నెల నుంచి ఇవి అమల్లోకి వచ్చాయి. అమెరికా అదనపు సుంకాలు సహేతుకం కాదని భారత్ ఇప్పటికే ఖండించింది. ఈ విషయంలో దేశ ప్రయోజనాలకు కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అయితే.. భారత్‌పై 50 శాతం సుంకాలు విధించడం అంత తేలికైన విషయం కాదని, రష్యాపై చర్యల కోసం ఢిల్లీతో విభేదానికి సిద్ధమయ్యామని ట్రంప్ ఇటీవల పేర్కొన్నారు.

# 470 ఎన్నికల పరిశీలకులు

## బీహార్‌తో పాటు 7 రాష్ట్రాలకు అధికారులను నియమించిన ఈసీ




**న్యూ ఢిల్లీ, సెప్టెంబర్29:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు, మరో ఏడు అసెంబ్లీ ఉప ఎన్నికలకు జనరల్, పోలీస్, ఎక్స్‌పెండిచర్ పరిశీలకులుగా 470 మంది అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదివారం నియమించింది. ఎన్నికలు సజావుగా, నిషాక్షికంగా నిర్వహించేలా అధికారులు తమ బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపింది. 470 మంది అధికారుల్లో 320 మంది ఐఏఎస్‌లు, 60 మంది ఐపీఎస్‌లు, 90 మంది ఐఆర్ఎస్, ఐఆర్ఏఎస్, ఐసీఏఎస్ సర్వీసులకు చెందిన వారు ఉన్నారు. ఎన్నికల పరిశీలకులు బీహార్‌లోని నియోజకవర్గాలతో పాటు బుద్గాం, నగ్రోటా (జమ్మూ అండ్ కశ్మీర్), అంతా (రాజస్థాన్) ఘాట్‌సిలా (జార□ండ్), జూబ్లీహిల్స్ (తెలంగాణ), తరన్ తారన్ (పంజాబ్), డంపా (జార□ండ్), నువాపడా (ఒడిశా)లో మోహరిస్తారు. రాజ్యాంగ నిర్దేశించిన ప్రకారం ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌కు పరిశీలకులు సహకరిస్తారని, ఎప్పటికిప్పుడు కమిషన్‌కు రిపోర్ట్ చేస్తుంటారని ఎలక్షన్ కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులలో తమకున్న సీనియారిటీ, సుదీర్ఘ అనుభవంతో ఎన్నికల సజావుగా జరిగేందుకు వీరంతా ఈసీకి సహక రిస్తారని, అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలించేందుకు ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్లను నియమించామని పేర్కొంది.

# ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు కేంద్రం మార్గదర్శకాలు

- ఈవీ ఛార్జింగ్ పరికరాలపై 100 శాతం సబ్సిడీ
- స్టేషన్ల విస్తరణకు ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ




**ఢిల్లీ, సెప్టెంబర్29:** దేశవ్యాప్తంగా పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద కేంద్రం దాదాపు 72,300 పబ్లిక్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి మార్గదర్శకాలను జారీ చేసింది. దీని కోసం రూ.2,000 కోట్ల ఖర్చు చేయనున్నది. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.10,900 కోట్లను కేటాయించిన సంగతి తెలిసిందే. ఉచిత ఛార్జర్లను అందించే నిబంధనకు అంగీకరిస్తే ప్రభుత్వానికి చెందిన కార్యాలయాలు, రెసిడెన్షియల్ కాంప్లెక్సులు, ఆసుపత్రులు, విద్యా సంస్థలు ఉన్న ప్రదేశాల్లో ఈవీ ఛార్జింగ్ పరికరాలపై 100 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. నగరాలు, హైవేల వెంట ప్రభుత్వ నిర్వహణలో ఉన్న ప్రదేశాలలో ప్రభుత్వం సెటప్ ఖర్చులలో 80 శాతం, ఛార్జింగ్ పరికరాల ఖర్చులలో 70 శాతం సబ్సిడీని అందిస్తుంది. ఇది రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, బస్ డిపోలు, మెట్రో స్టేషన్లు, మునిసిపల్ పార్కింగ్ స్థలాలు, హైవే టోల్ ప్లాజాల వంటి ప్రదేశాలకు వర్తిస్తుంది. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) ఈవీ పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్ల విస్తరణకు ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీ (పీఐఏ)గా పనిచేయనుంది. సబ్సిడీని రెండు దశల్లో ఇవ్వనునారు. నిబంధనలు, పనితీరు ప్రమాణాలను పూర్తి చేసిన తర్వాత నిధులు విడుదలవుతాయి. ఈ పథకంలో భాగంగా పది లక్షల కంటే ఎక్కువ జనాభా కలిగిన పట్టణ కేంద్రాలు, స్మార్ట్ సిటీలు, మెట్రోతో అనుసంధానం ఉన్న పట్టణాలు, రాష్ట్ర రాజధానులు, అధిక జనసాంద్రత కలిగిన జాతీయ, రాష్ట్ర హైవేలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.


ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
29 సెప్టెంబర్
2025






# అన్నిటా అమ్మే.. అందరూ ఆమే

**మన మాతృమూర్తులు తొమ్మిది నెలలపాటు గర్భాన్ని మోసి, పదవ నెలలో మనల్ని కన్నారు. ఆ తొమ్మిది నెలలూ ఎన్నెన్నో క్రిమి కీటకాలు తమను పీడిస్తూ ఉంటే ఆ బాధను తట్టుకున్నారు. లలితాంబిక ఈ లోకపు అమ్మలా కాకుండా... నెలకు ఒక్క రోజును సంకేత రూపంగా పెట్టుకొని, తొమ్మిది రాత్రుల పాటు రాక్షసులతో పోరాడి, పదవ రోజున విజయ దశమిని చేసుకుంది. అందుకే అవి నవ రాత్రులు. వాటి తరువాతిదైన పదవ రోజే అమ్మ విజయాన్ని సాధించినదైన విజయ దశమి అయింది. ఆ అమ్మ ఏ కష్టాలను ఎవరి ద్వారా తీరుస్తూ... సర్వారాధ్యురాలు ఎలా అయిందో తెలుసుకుందాం.**



ఎవరైనా రోగి అనారోగ్యంతో వైద్యుడి దగ్గరకు వెళితే... ఆ రోగికి ఉండే లక్షణాలన్నిటినీ విని, ఏ వ్యాధి నివారణకు అది అవసరమో ఆలోచించి, అనుగుణమైన ఔషధాన్ని ఇస్తాడు. అలాగే అమ్మ ఈ ముల్లోకాలలో ఉండే అందరికీ ఎన్ని ఆపదలు వస్తాయో ఆలోచించింది. వేయి సమస్యలు ఉంటాయని ఆమెకు అర్థమయింది. దాంతో ఆ లలితాపరాభట్టారిక (లలితాదేవి) తన వద్ద ఉంటూ, తన ప్రతి కదలికనూ గమనిస్తున్న ఎనిమిది మందిని పిలిచింది (వారిలో మొదటి ఆమె పేరు వశిని. అందుకే ఆ ఎనిమిది మందిని వశిన్యాది వాగ్దేవతలు అంటారు). వేయి ఆపదలకు వేయి నామాలను సిద్ధం చేయాల్సిందిగా వారిని ఆజ్ఞాపించింది. అంతటి గొప్ప అవకాశం తమకు లభించిందన్న మహదానందంతో... అమ్మ రూప సౌందర్యాన్ని, అమ్మ మంత్ర రూపాన్ని, అమ్మ యుద్ధం చేసే విధానాన్ని, అమ్మ తన భర్త అయిన శివుడితో మెలిగే పద్ధతినీ, గర్భంతో ఉన్న మహిళ ఏయే ఆహారాలను ఏయే నెలలో తింటే ఉత్తమ శిశువు కలుగుతుందో ఆ ఆహార నియమాలను... ఇలా ఒక్కో విభాగానికి వందేసి నామాలతో... మొత్తం పది విభాగాలకు వేయి నామాలను ఆ వశిన్యాది వాగ్దేవతలు సిద్ధం చేశారు. దేవతల నిండు సభలో... ఆ వేయి నామాలను చదవాల్సిందిగా ఆదేశించింది. వాటన్నిటినీ తనతోపాటు సకల దేవతాగణం విన్నాక... 'ఇదం నామ సహస్రమ్మే యో మద్భక్తః పఠేత్ సకృత్'... ఈ వేయింటిని మాత్రమే (అంటే మరికొందరు కూడా వేయి నామాలను సిద్ధం చేశారన్నమాట) ఎవరైతే పఠిస్తారో, వారి కోర్కెలన్నిటినీ శ్రద్ధతో తీరుస్తానని ప్రకటించింది. లలితా సహస్ర నామాలు అంతటి గొప్పవి. ఏ తీరు కష్టం ఏ రూపంలో, ఎంత పరిమాణంలో వచ్చినా... ఈ వేయి నామాలే దివ్యౌషధాలని అమ్మే స్వయంగా చెప్పింది. అందుకే మరెవరినో, ఇంకెవరినో ధ్యానించనక్కరలేదు. వాంఛితం నెరవేరడానికి లలితా నామాలు చాలు. ఎందరెందరు దేవతలు ఆ నామాల్లో దాగి ఉన్నారో పరిశీలిద్దాం.

### ఇతర దేవతల పూజ ఎలా?

'మా బిడ్డలకు చదువు రావాలి కదా! లలితా సహస్ర నామాలు మాత్రమే చదువుతూ ఉంటే అదెలా సాధ్యం?' అనుకుంటారు ఎంతోమంది. తన వేయి నామాల్లో ఉన్న విషయాన్ని చూపిస్తూ, "ఆ సరస్వతి తన రూపమే" అంటూ 'సరస్వతీ శాస్త్రమయీ గుహాంబా గుహ్య రూపిణీ' అని తన వేయి నామాల్లో (137వ శ్లోకం) ఉందని కాబట్టి తనను ఆరాధిస్తే మరిక సరస్వతిని ఆరాధించనక్కర్లేదని ఆ లలితాంబికే చెప్పింది. ఇక, 'చదువు బాగా వచ్చాక కూడా ఆదాయం లేకపోతే ఈ లలితా నామాలు ఏం రక్షిస్తాయి?' అని బాధ పడనక్కర్లేదు. 'మహేశ్వరీ మహా దేవీ మహాలక్ష్మీ ర్మృడ ప్రియా' (53వ శ్లోకం) ఉంది. "మేము కొన్ని తరాల నుంచి పార్వతీ దేవిని ఆరాధిస్తే తప్ప ఏ కార్యానికీ పసుపు దంచనైనా దంచబోమ"ని ఎవరైనా అడిగితే... 'పార్వతీ పద్మనయనా పద్మరాగ సమప్రభా' అంటూ పార్వతి కూడా తనలో అంతర్లీనంగా ఉన్న రూపమేనని గుర్తించాలని చెబుతోంది లలితమ్మ. "మేము పూర్తిగా విష్ణు భక్తులం. మా పెద్దలు కూడా నారాయణుణ్ణే సేవించండి, పొరపాటున కూడా లలితా నామాలు చదవవద్దని మమ్మల్ని శాసించారు"ని అన్నారనుకోండి... 'గోప్త్రీ గోవింద రూపిణీ' (63వ శ్లోకం) అనే ఆధారం ఉంది... ఆ నారాయణుడు కూడా లలితాంబ రూపమేనని. "శైవ విధానాన్ని పాటించే మేము ఉమాదేవి ఆరాధకులం, ఆ ఉమా నామాలు ఎక్కడున్నాయి?" అని కంగారు అవసరం లేదు. ఉమాదేవి కూడా లలితా రూపాల్లో ఒకటేనంటూ 'ఉమా శైలేంద్ర తనయా గౌరీ గంధర్వ సేవితా' (126వ శ్లోకం) అనే సాక్ష్యం ఉంది. ఉద్యోగం, ధనాదాయం లేని వారు లలితా దేవిని పూజిస్తే అవి ఎలా లభిస్తాయనే ప్రశ్నకు 'రాజ్యలక్ష్మీ కోశనాథా చతురంగ బలేశ్వరి' (135వ శ్లోకం) అనే ప్రమాణం ఉంది. 'బ్రహ్మోపదేశ సమయంలో చెప్పిన గాయత్రిని పఠించకపోతే ఎలా?' అనుకోనక్కర్లేదు. 'గాయత్రీ వ్యాహృతీ స్సంధ్యా ద్విజ బృంద నిషేవితా' (90వ శ్లోకం) అని అమ్మవారే స్వయంగా చెబుతోంది. లక్ష్మీ, సరస్వతుల్లో ఎవరిని ఎక్కువగా లలితాంబిక పరిగణిస్తోంది? (సచామర రమావాణీ సవ్య దక్షిణ సేవితా...) అమ్మవారికి కుడివైపున సరస్వతి, ఎడమవైపున లక్ష్మి వింజామరలు వీస్తూ కనిపిస్తున్నారు. కుడి ఎడమల్లో కుడికే ప్రాధాన్యం కాబట్టి సరస్వతే గొప్పదని అర్థమవుతోంది. అంటే ధనం కన్నా విద్యకు, జ్ఞానానికే ప్రాధాన్యం.

### సర్వదేవతా సమూహ రూపం

"శ్రీ మహా విష్ణువు ప్రసిద్ధంగా దశావతారాలను, మొత్తం మీద 21 అవతారాలను ఎత్తాడు కదా! ఆ రాముణ్ణి, కృష్ణుణ్ణి, లక్ష్మీ నరసింహ స్వామిని... ఇలా వీరెవరినీ పూజించకుండా, లలితా నామాలను చదువుకుంటూ ఎలా కూర్చుంటాం?" అని అడిగితే 'కరాంగుళి నఖోత్పన్న నారాయణ దశాకృతిః' (32వ శ్లోకం) అని అమ్మ స్వయంగా చెబుతోంది. అంటే 'అమ్మ చేతి గోటి నుంచి పుట్టినవే నారాయణావతారాలన్నీ' అని అర్థం. అన్నిటికన్నా... 'శివుణ్ణి పూజించకుండా లలితా నామాల వెంట పడితే ఎలా?' అనుకోనక్కర్లేదు.' శ్రీ శివా శివ శక్త్యైక్య రూపిణీ' (183వ శ్లోకం) అని కనిపిస్తుంది లలితా సహస్ర నామాల చివరిలో. అంటే ఎందరెందరు స్త్రీ పురుష దేవతలు జగత్తును, దానిలో ఉన్న సర్వప్రాణులను రక్షించడానికి ఉన్నారో... ఆ అందరూ లలితలోనే ఉన్నారు. లలితాంబను ఆరాధిస్తే... మీరు ఎవరిని ఆరాధించదలచుకున్నారో వారందరూ ఆరాధనలు పొందినట్టే. 'లలిత సర్వదేవతా సమూహ రూపం' అని దీని అర్థం. ఈ నవరాత్రుల కాలంలో లలితా నామాలను 108 సార్లు పఠిస్తే వాంఛితాలు నెరవేరుతాయనేది శాస్త్ర వాక్యం.

# ఆ చిక్కుల్లోంచి బయట పడదాం



మన అంతర్గత సూక్ష్మ నాడీ వ్యవస్థలో... ఆరోగ్యాన్ని సంరక్షించే ఇడా, పింగళ, సుషుమ్న నాడులు, వాటికి అనుసంధానమై ఉండే బ్రహ్మ, విష్ణు, రుద్ర గ్రంధుల పాత్ర చాలా కీలకం. అవి శారీరకంగా, ఆధ్యాత్మికంగా అనేక విధులు నిర్వహిస్తాయి. శ్రీ లలితా సహస్రనామాలలో వీటి ప్రస్తావన ఉంది. వాటిలో లలితాదేవిని 'బ్రహ్మ గ్రంధి విభేదిని', 'విష్ణు గ్రంధి విభేదిని', 'రుద్ర గ్రంధి విభేదిని' అని స్తుతించడం జరిగింది. మానవులు వారి స్వభావాన్ని బట్టి, తీరును బట్టి మూడు విధాల చిక్కు సమస్యల్లో ఉంటాయి. వారు పుట్టినప్పటి నుంచే ఈ చిక్కు ముడులు ప్రారంభమవుతాయి. వాటి నుంచి బయట పడాలంటే ఆ ముడులను ఛేదించాలి. వాటిని సంస్కృతంలో గ్రంథులు అంటారు. అవి మనలో అసంబద్ధమైన, అసత్యమైన భ్రమలను కలిగిస్తాయి. శరీరపరంగా చూస్తే... మన సూక్ష్మ శరీర వ్యవస్థలో దాదాపు అన్ని చక్రాలకు లేదా శక్తి కేంద్రాలకు ఏదో ఒక గ్రంధి అనుసంధానమై ఉంటుంది. బ్రహ్మ, విష్ణు, రుద్ర గ్రంధులు ఏయే నాడులకు అనుసంధానమై ఉన్నాయో, వాటిని ఏవి నియంత్రిస్తున్నాయో తెలుసుకుందాం.

### అది భగవంతుడికే సాధ్యం

బ్రహ్మ గ్రంధి ఇడా నాడికి అనుసంధానమై ఉంటుంది. ఈ నాడి లక్షణం తమో గుణం. గతాన్ని పట్టుకొని వేలాడడం. ఆత్మ సాక్షాత్కారం పొందిన తరువాత... మీ చిత్తాన్ని ఆత్మపై లగ్నం చేస్తే... మీ పాత అలవాట్లన్నీ క్రమంగా తొలగిపోతాయి. అప్పుడు మీలో కలిగే ఆధ్యాత్మిక ఉన్నతి ద్వారా బంధరాహిత్యాన్ని పొందుతారు. దీన్ని 'బ్రహ్మ గ్రంధి' అనడానికి కారణం... బ్రహ్మ అంటే చైతన్య శక్తి. అదే 'ఓం'. మన ఆత్మ ప్రాపంచిక విషయాలపైనా, వస్తు వ్యామోహాల్లో చిక్కుకున్నప్పుడు... మన చిత్తాన్ని భౌతిక అంశాలు కప్పేస్తాయి. అది ఒక స్థాయికి పెరిగి... ఒక ముడి ఏర్పడుతుంది. దీనివల్ల మీరు కేవలం వస్తు ప్రపంచాన్నే చూస్తారు తప్ప ఆత్మను కాదు.

ఈ ముడి పృధ్వీ తత్త్వంతో ఏర్పడుతుంది. సహజయోగ ద్వారా ఆ ముడి నుంచి బయటపడవచ్చు. అది విడిపోగానే కుండలినీ ఉత్థానం ప్రారంభమవుతుంది. ఈ మొదటి ముడి చాలా ముఖ్యమైనది. ఇక... రెండోది విష్ణు గ్రంధి. అంతా మనమే, మన శక్తితో చేస్తున్నామనే అపోహలో ఉంటాం. దాన్ని 'రజో గుణం' అంటారు. కుడి పార్శ్వపు పింగళా నాడి లక్షణం రజో గుణం. దానివల్లే మీరు అహంకారంతో పనులు చేస్తారు. ఈ రెండో ముడిని ఛేదించడం భగవంతుడి ద్వారానే సాధ్యపడుతుంది. కాబట్టి మనం చేసిన పనిని భగవంతుడికి సమర్పించాలి.

### మధ్య మార్గం

మూడోది రుద్ర గ్రంధి. దీనిది సత్వగుణం, అది సుషుమ్నా నాడి లక్షణం. దాని ద్వారానే మనం భగవంతుణ్ణి తెలుసుకుంటాం. దానివల్లనే ఏది మంచో, ఏది చెడ్డో గ్రహిస్తాం. కాబట్టి రజో, తమో గుణాలను విడిచిపెట్టి, సత్వ గుణాన్ని అనుసరించాలి. ఈ ముడి విడిపోయేవరకూ మనకు వివేకం రాదు. ఇది మధ్య మార్గం. ఆ మార్గంలోనే... అంతా భగవంతుడి వల్లనే సాధ్యమవుతుందనే సూక్ష్మమైన విషయాన్ని మనిషి తెలుసుకుంటాడు. సత్యాన్వేషణలో మధ్య మార్గం చాలా విశిష్టమైనది. మూలాధార చక్రంలోని కుండలినీ శక్తి జాగృతమై... సూక్ష్మ శరీరంలోని చక్రాల ద్వారా ప్రయాణిస్తూ, బ్రహ్మరంధ్రాన్ని ఛేదించుకొని, సహస్రారం దగ్గర సర్వ వ్యాపకుడైన భగవంతుడి శక్తితో ఏకమైనప్పుడు... ఆ స్థితిని 'ఆత్మ సాక్షాత్కారం అంటారు. సహజయోగ ధ్యాన సాధనలో కుండలినీ శక్తి జాగృతమైనప్పుడు... ఈ మూడు గ్రంధులూ వికసిస్తాయి. తద్వారా వాటిలో ఉన్న సమస్యలు తొలగిపోతాయి.

# మనలోని రావణులను సంహరిద్దాం

భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో విజయదశమి లేదా దసరా పర్వదినం అత్యంత ప్రముఖమైనది. 'దశ' అంటే పది. 'హరా' అంటే సంహరించడం. అంటే పది తలల రావణాసురుణ్ణి శ్రీరామచంద్రుడు సంహరించడం. దుష్ట శక్తులపై దైవ శక్తి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి. అంతేకాదు, ద్వాపరయుగంలో పన్నెండేళ్ళ వనవాసం, ఒక ఏడాది అజ్ఞాతవాసం పూర్తి చేసి, విరాటరాజు కొలువులోకి వెళ్ళేముందు... పాండవులు తమ ఆయుధాలను శమీ వృక్షం (జమ్మి చెట్టు)పై దాచిపెట్టారు. గోవులను అపహరించిన కౌరవులపై యుద్ధానికి మళ్ళీ ఆ అస్త్రాలను చేతపట్టి విజయం సాధించారు. ఆ విధంగా పాండవులు తమ ఆయుధాలను తిరిగి పొందిన రోజు... దసరాకు ముందురోజే కావడంతో... వివిధ వృత్తులవారు తమ వృత్తులకు తోడ్పడుతున్న పనిముట్లను, గృహస్తులు తమ ఇళ్ళలోని సామగ్రిని గుర్తించి, సమీక్షించుకోనే రోజుగా... ఆయుధపూజగా సంప్రదాయంలో అంతర్భాగం అయింది.

### శ్రీరాముని సందేశం

దుర్మార్గులను శాస్త్రం ఆరు రకాలుగా పేర్కొంది. వారు: విషం పెట్టేవాడు, ఇంటికి నిప్పు పెట్టేవాడు, మారణాయుధాలతో దాడి చేసేవాడు, ఇతరుల ధనాన్ని దోచేవాడు, ఇతరుల స్థలాన్ని ఆక్రమించేవాడు, పరుల భార్యను చెరపట్టేవాడు. అలాంటి దుర్మార్గులను శీఘ్రమే తగిన విధంగా శిక్షించడం కూడా రాజు విధులలో భాగం అని శాస్త్రం వివరించింది. కుమారుడిగా, సోదరుడిగా, భర్తగా, ప్రభువుగానే కాదు... మామూలు మనిషిగా తోటివారి పట్ల ఉండాల్సిన మానవీయత, ఉన్నత సంస్కారం కలిగినవాడే శ్రీరాముడు. అందుకే నేటికీ మనందరం మళ్ళీ అటువంటి రామరాజ్యం కోసం తహతహలాడుతూ ఉంటాం.



సీతాదేవిని అపహరించిన రావణుడు... శ్రీరాముని పట్ల దుర్గార్గాన్ని ప్రదర్శించిన కారణంవల్లనే... ప్రపంచ చరిత్రలో అసమానమైన విధంగా అతడికి గుణపాఠం చెప్పవలసి వచ్చింది. రావణుడు సైతం తపోసంపన్నుడు, పరమశివుడికి భక్తుడు అయినప్పటికీ... తన శక్తులను సద్వినియోగపరచుకోలేకపోయాడు. మానవ జీవిత లక్ష్య సాధనకు ధర్మాధర్మాల విచక్షణ, వాటి అవలంబించడం ఎంత ముఖ్యమైనవో రావణ సంహారం ద్వారా లోకానికి సందేశమిచ్చారు శ్రీరామచంద్ర ప్రభువు.

### మనమేం చేయాలి?

ప్రస్తుత కాలంలో సమాజం కేవలం రావణుడి దిష్టిబొమ్మ దహనం చేయడంతో సరిపెట్టకుండా... మన మనస్సులోని కామ, క్రోధ, మోహ, లోభాలనే అంతర్గత రావణులను సంహరించడానికి ప్రయత్నించాలి. విజయదశమి జ్ఞాన సంపాదనకు మంచి రోజు. ఈ పండుగ నేపథ్యంలో గొప్ప మార్పును పొందడానికి శ్రీకారం చుట్టాలి. భగవద్గీత బోధించిన విధంగా, ప్రామాణిక గురుశిష్య పరంపరద్వారా... ఆధ్యాత్మిక జ్ఞానాన్ని నిత్యం అభ్యసించడం అనే కొత్త అలవాటును యువతరం ప్రారంభించాలి. మనస్సులోని కల్మషాల కారణంగానే మనస్సు శత్రువు అవుతుంది. పరిశుద్ధమైన ప్పుడు మనస్సే ఒక మంచి మిత్రుడు కూడా. కపటం, కల్మషాల నుంచి మనస్సు విముక్తి పొందడానికి కలియుగంలో నిర్దేశించినదే 'హరే కృష్ణ' మహామంత్రం. కల్మష భూయిష్టమైన ఈ యుగానికి శాస్త్రం నిర్దేశించిన 'హరినామం' అనే దివ్యౌషధాన్ని ప్రతి ఒక్కరూ సేవించేలా రూపకల్పన చేసిన మహావదాన్యులు శ్రీ చైతన్య మహాప్రభువులు. ఆనాడు లోకంలో అనర్థాలను సృష్టించిన రావణా దులను రామబాణం దహించివేయగా, నేడు మనలో అనర్థాలను సృష్టించే కామ, క్రోధ, లోభాదులను రామనామమే దహించివేయగలదు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
29 సెప్టెంబర్
2025







## రొయ్యలను తింటే అసలు ఎలాంటి లాభాలు కలుగుతాయి..?

### వీటిని ఎంత మోతాదులో తినాలి..?

నాన్ వెజ్ ప్రియులు వివిధ రకాల మాంసాహారాలను తింటుంటారు. వాటిల్లో రొయ్యలు కూడా ఒకటి. రొయ్యిలు మనకు అనేక రకాలుగా లభిస్తాయి. పచ్చి రొయ్యలు చాలా టేస్టీగా ఉంటాయి. అద్భుతమైన ప్రయోజనాలను, పోషకాలను అందిస్తాయి. రొయ్యలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చాలా మంది ప్రజలు ఎంతో ఇష్టంగా తింటారు. రొయ్యలు మనకు అనేక లాభాలను అందిస్తాయి. రొయ్యల్లో హై క్వాలిటీ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ప్రోటీన్ల వల్ల కణజాలం మరమ్మత్తులకు గురవుతుంది. ఎంజైమ్‌లు, హార్మోన్లు సరిగ్గా ఉత్పత్తి అవుతాయి. రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది. రొయ్యల్లో అనేక విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి.

**థైరాయిడ్ ఉన్నవారికి..**

రొయ్యల్లో విటమిన్ బి12 అధికంగా ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయం చేస్తుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. దీని వల్ల నాడీ సంబంధ సమస్యలు తగ్గుతాయి. ముఖ్యంగా మెడ, భుజాల్లో వచ్చే నొప్పి తగ్గుతుంది. రొయ్యల్లో ఐరన్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. శరీరంలో ఆక్సిజన్ సరఫరా సక్రమంగా జరిగేలా చూస్తుంది. దీంతో నీరసం, అలసట తగ్గుతాయి. రొయ్యల్లో ఉండే జింక్ రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. దీని వల్ల గాయాలు, పుండ్లు త్వరగా మానుతాయి. కణాల నిర్మాణం జరుగుతుంది. రొయ్యల్లో ఉండే అయోడిన్ థైరాయిడ్ ఉన్నవారికి మేలు చేస్తుంది. థైరాయిడ్ సమస్య నుంచి బయట పడేలా చేస్తుంది. శరీర మెటబాలిజంను పెంచుతుంది. దీంతో జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడతాయి. థైరాయిడ్ గ్రంథి ఆరోగ్యంగా ఉంటుంది.

**ఎలా తినాలి..?**

రొయ్యల్లో సెలీనియం అధికంగా ఉంటుంది. ఇది మినరల్ అయినప్పటికీ శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌లా కూడా పనిచేస్తుంది. ఇది కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తుంది. దీంతో క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. రొయ్యల్లో కొలెస్ట్రాల్ ఉంటుంది. కానీ ఇది చాలా స్వల్ప మోతాదులో ఉంటుంది. అందువల్ల రొయ్యలను తింటే మన శరీరంలోని కొలెస్ట్రాల్‌పై ఎలాంటి ప్రభావం పడదు. అయితే రొయ్యలను ఉడకబెట్టి లేదా కూర రూపంలో తినాలి. వేపుడు రూపంలో తినకూడదు. అలా తింటే నష్టమే ఎక్కువ జరుగుతుంది. ఇక రొయ్యల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. కనుక శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. దీని వల్ల రక్త నాళాలు ఆరోగ్యంగా ఉంటాయి. గుండె పనితీరు మెరుగు పడుతుంది. గుండె జబ్బులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**ఎంత మోతాదులో తినాలి..?**

రొయ్యల్లో ఆస్టాజాంతిన్ అనే ఓ ప్రత్యేకమైన యాంటీ ఆక్సిడెంట్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది కూరగాయల్లో లభించే బీటా కెరోటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ కన్నా చాలా శక్తివంతమైంది. దీని వల్ల శరీరంలో అంతర్గతంగా ఉండే వాపులు తగ్గుతాయి. ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. గుండె కండరాలు, రక్త నాళాల వాపులు తగ్గుతాయి. దీంతో గుండె పోటు రాకుండా చూసుకోవచ్చు. రొయ్యల్లో క్యాలరీలు చాలా తక్కువగా, ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. కనుక వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఇక రొయ్యలను 100 గ్రాముల మోతాదులో తింటే మనకు దాదాపుగా 100 క్యాలరీల శక్తి లభిస్తుంది. ప్రోటీన్లు 24 గ్రాములు, కొవ్వులు 2 గ్రాములు, కొలెస్ట్రాల్ 200 మిల్లీగ్రాములు లభిస్తాయి. విటమిన్ బి12తోపాటు సెలీనియం, అయోడిన్, ఫాస్ఫరస్ వంటి పోషకాలను పొందవచ్చు. ఇక రొయ్యలు ఆరోగ్యకరమే అయినప్పటికీ వీటిని మోతాదులోనే తినాల్సి ఉంటుంది. వారానికి సుమారుగా 150 గ్రాముల వరకు రొయ్యలను తినవచ్చు. ఇలా పలు జాగ్రత్తలను పాటిస్తూ వీటిని తింటే అనేక లాభాలను పొందవచ్చు.


## దగ్గు, జలుబుతో అవస్థ పడుతున్నారా..?

### అయితే ఈ సహజసిద్ధమైన ఇంటి చిట్కాలను పాటించండి..!

దగ్గు, జలుబు అనేవి సీజన్లు మారినప్పుడల్లా మనకు వస్తూనే ఉంటాయి. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి సీజన్లు మారకున్నా తరచూ ఈ సమస్యలు ఇబ్బందులకు గురి చేస్తుంటారు. వాతావరణంలో వచ్చే మార్పులతోపాటు కాలుష్యం, పలు ఇతర కారణాల వల్ల కూడా దగ్గు, జలుబు సమస్యలు మనల్ని అవస్థలకు గురి చేస్తుంటాయి. అయితే ఈ సమస్యలకు చాలా మంది ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడుతుంటారు. కానీ ఇంగ్లిష్ మెడిసిన్‌ను తరచూ వాడడం వల్ల దీర్ఘకాలంలో అనేక సమస్యలు వస్తాయి. అనేక సైడ్ ఎఫెక్ట్స్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. దీంతో పలు వ్యాధులు సైతం వచ్చేందుకు అవకాశాలు ఉంటాయి. కనుక ఇంగ్లిష్ మెడిసిన్‌ను ఎక్కువగా వాడకూడదు. మరి ఆయా సమస్యల నుంచి ఎలా బయట పడాలి అని చాలా మందికి సందేహం వస్తుంటుంది. కానీ అందుకు ఆయుర్వేదంలో చక్కని పరిష్కారాలు ఉన్నాయి. పలు ఇంటి చిట్కాలను పాటించడం వల్ల ఆయా సమస్యల నుంచి సులభంగా బయట పడవచ్చు. పైగా వాటి వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉండవు. ఇక ఆ ఇంటి చిట్కాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**హెర్బల్ టీలు..**

దగ్గు, జలుబు వంటి సమస్యలు ఉన్నప్పుడు రోజూ 2 లేదా 3 సార్లు హెర్బల్ టీలను సేవిస్తుండాలి. అల్లం, తులసి, కమోమిల్, పెప్పర్‌మింట్ వంటి హెర్బల్ టీలు ఆయా సమస్యల నుంచి త్వరగా బయట పడేలా చేస్తాయి. వీటిల్లో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఇన్ ఫెక్షన్లను త్వరగా తగ్గిస్తాయి. దీంతో దగ్గు, జలుబుతోపాటు ముక్కు దిబ్బడ నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. వేడి వేడి చికెన్ లేదా వెజిటబుల్ సూప్‌ను తాగుతున్నా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. దీని వల్ల కఫం త్వరగా కరిగిపోతుంది. దగ్గు, జలుబు తగ్గుతాయి. ఇక ఈ సమస్యలను తగ్గించడంలో తేనె కూడా అద్భుతంగా



పనిచేస్తుంది. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. ఒక టీస్పూన్ తేనెను ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలిపి రోజుకు 2 సార్లు లేదా 3 సార్లు తాగుతుంటే ఫలితం ఉంటుంది. అవసరం అయితే అందులో నిమ్మరసం కూడా కలుపుకోవచ్చు.

**అల్లం, వెల్లుల్లి..**

అల్లంలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి గొంతు సమస్యలను తగ్గిస్తాయి. వికారం నుంచి బయట పడేలా చేస్తాయి. వైరస్ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. అల్లంను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను వడకట్టి అందులో కాస్త తేనె, నిమ్మరసం కలిపి తాగాలి. లేదా నేరుగా ఒక టీస్పూన్ అల్లం రసాన్ని కూడా తాగవచ్చు. ఇలా రోజుకు 2 లేదా 3 సార్లు చేస్తుంటే ఫలితం ఉంటుంది. ఇక వెల్లుల్లిలో ఆల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. ఇందుకు గాను 2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను తీసుకుని కాస్త నలిపి అందులో కాస్త తేనె కలిపి నేరుగా అలాగే తినేయాలి. లేదా వెల్లుల్లి రసాన్ని కూడా తాగవచ్చు. ఇలా రోజుకు 2 సార్లు చేస్తుంటే ఉపయోగం ఉంటుంది.

**పసుపు, మిరియాలు..**

పసుపు, మిరియాల పొడి, దాల్చిన చెక్క పొడిలలో దేన్నయినా సరే పాలలో కలిపి తీసుకుంటే ఉపయోగం ఉంటుంది. వీటిల్లో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తాయి. దగ్గు, జలుబు నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. నారింజ, నిమ్మ వంటి సిట్రస్ జాతికి చెందిన పండ్లను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. వీటిల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. దీని వల్ల దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే ఈ పండ్లను తేనెతో కలిపి తింటే ఇంకా ఎక్కువ ఫలితం ఉంటుంది. ఇలా ఆయా ఇంటి చిట్కాలను పాటిస్తే దగ్గు, జలుబు నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. పైగా ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి.

## పెరుగులో బెల్లం కలిపి తింటే ఇన్ని లాభాలు ఉన్నాయా..?

### తెలిస్తే వెంటనే తినడం ప్రారంభిస్తారు..!

పెరుగును మనం రోజువారి ఆహారంలో భాగంగా తింటూనే ఉంటాం. భోజనం చివర్లో పెరుగును తినకపోతే చాలా మందికి భోజనం చేసిన సంతృప్తి ఉండదు. అలాగే బెల్లాన్ని కూడా మనం వాడుతూనే ఉంటాం. దీన్ని తీపి పదార్థాల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే పెరుగులో బెల్లం కలిపి తింటే అనేక లాభాలు ఉంటాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ఈ మిశ్రమం అత్యంత ఎక్కువ పోషక విలువలను కలిగి ఉంటుందని అంటున్నారు. కనుక దీన్ని తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని సూచిస్తున్నారు. పెరుగులో బెల్లం కలిపి తింటే ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. మలబద్దకం ఉన్నవారు రోజూ ఈ మిశ్రమాన్ని తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది.

**జీర్ణ సమస్యలకు..**

పెరుగులో బెల్లం కలిపి తినడం వల్ల అనేక జీర్ణ సమస్యలను తగ్గించుకోవచ్చు. ముఖ్యంగా పొట్టలో ఉండే అసౌకర్యం తొలగిపోతుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. కడుపు ఉబ్బరం తగ్గుతుంది. బెల్లంలో ఉండే సహజసిద్ధమైన చక్కెరలు మన శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. దీని వల్ల శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం, అలసట ఉండవు. ఉత్సాహంగా పనిచేస్తారు. యాక్టివ్‌గా ఉంటారు. చురుకుదనం వస్తుంది. బద్దకం పోతుంది. పెరుగులో ఉండే ప్రోటీన్లు, కొవ్వులు షుగర్ లెవల్స్‌ను నియంత్రిస్తాయి. దీని వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుంది. కనుక డయాబెటిస్ ఉన్నవారు కూడా ఈ మిశ్రమాన్ని తినవచ్చు.



**ఎముకల ఆరోగ్యానికి..**

ఈ మిశ్రమంలో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది రక్తం వృద్ధి చెందేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. ఈ మిశ్రమంలో ఉండే మెగ్నిషియం, పొటాషియం, ఫాస్ఫరస్ వంటి పోషకాలు ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ మిశ్రమాన్ని తినడం వల్ల క్యాల్షియం కూడా అధిక మొత్తంలో లభిస్తుంది. ఇది ఎముకలను దృఢంగా మార్చి ఆరోగ్యంగా ఉంచుతుంది. అనేక రకాల బి విటమిన్లు సైతం ఈ మిశ్రమం ద్వారా మనకు లభిస్తాయి. పెరుగు శరీరానికి చల్లదనం అందిస్తుంది. కనుక ఈ మిశ్రమాన్ని తింటే శరీరంలో ఉండే వేడి పోతుంది. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. కొందరికి సీజన్లతో సంబంధం లేకుండా శరీరంలో వేడి ఎల్లప్పుడూ ఉంటుంది. అలాంటి వారు ఈ మిశ్రమాన్ని తింటుంటే ఫలితం ఉంటుంది.

**లివర్ ఆరోగ్యానికి..**

పెరుగులో బెల్లం కలిపి తినడం వల్ల లివర్, రక్తం శుద్ధి అవుతాయి. ఆయా భాగాల్లో ఉండే వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. దీంతో శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. ఈ మిశ్రమం వల్ల జీర్ణ వ్యవస్థ సైతం శుభ్రంగా మారి ఆరోగ్యంగా ఉంటుంది. పెరుగులో బెల్లం కలిపి తింటే శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. రోగాలను తగ్గిస్తుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇక ఈ మిశ్రమం ఆరోగ్యకరమే అయినప్పటికీ కొన్ని రకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారు మాత్రం దీన్ని తినకూడదు. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారు, విరేచనాలు అవుతున్నవారు, అలర్జీలు ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తినకపోవడమే మంచిది. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ పెరుగు, బెల్లం మిశ్రమాన్ని తింటుంటే అనేక లాభాలను పొందవచ్చు.

## ఉల్లిపాయలను నేరుగా తినడం ఇష్టం లేదా..?

### అయితే వాటితో టీ ఇలా తయారు చేసి తాగండి.. ఎన్నో లాభాలు కలుగుతాయి..!

ఉల్లిపాయలను మనం రోజువారి ఆహారంలో భాగంగా తింటూనే ఉంటాం. ఉల్లిపాయలను మనం రోజూ కూరల్లో లేదా వివిధ రకాల వంటల్లో వేస్తుంటాం. దీని వల్ల వంటలకు చక్కని రుచి వస్తుంది. ఉల్లిపాయలను కొందరు రోజూ పచ్చిగానే తింటుంటారు. అయితే ఉల్లిపాయలు ఘాటుగా ఉంటాయి కనుక కొందరు పచ్చిగా తినేందుకు ఇష్టపడరు. పైగా ఉల్లిపాయలను తింటే నోరు వాసన వస్తుంది. కనుక ఉల్లిపాయలను తినేందుకు కొందరు ఇష్టపడరు. అయితే ఉల్లిపాయలతో టీ తయారు చేసి తాగవచ్చు. దీంతో అనేక లాభాలు కలుగుతాయి. ఉల్లిపాయలను పచ్చిగా తింటే ఎలాంటి లాభాలు కలుగుతాయో, దీంతో టీ తయారు చేసి తాగినా కూడా అలాంటి లాభాలే కలుగుతాయి. పైగా ఘాటుదనం కాస్త తగ్గుతుంది. నోరు కూడా వాసన రాదు. కనుక ఉల్లిపాయల టీని ఎవరైనా సరే తాగవచ్చు. దీంతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

**సీజనల్ వ్యాధులకు చెక్..**

ఉల్లిపాయల టీని పలు సంప్రదాయ వైద్య విధానాల్లో ఔషధంగా కూడా ఉపయోగిస్తారు. ఇది గొంతు సమస్యలను తగ్గిస్తుంది. దగ్గు నుంచి ఉపశమనం లభించేలా చేస్తుంది. ఉల్లిపాయల్లో క్వర్సెటిన్, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి కనుక ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ, యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉంటాయి. ఇవి ఇన్ ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాయి. దీంతో సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉల్లిపాయల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక



వ్యవస్థను పటిష్టంగా మారుస్తాయి. దీని వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. దీంతో రోగాల నుంచి త్వరగా బయట పడవచ్చు.

**జీర్ణ వ్యవస్థకు..**

ఉల్లిపాయల్లో ఉండే క్వర్సెటిన్ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది కనుక శరీరంలోని తీవ్రమైన వాపులు సైతం తగ్గిపోతాయి. ముఖ్యంగా కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఉల్లిపాయల టీ సహజసిద్ధమైన ఎక్స్ పెక్టోరెంట్‌గా పనిచేస్తుంది. ఇది గొంతు, ఊపిరితిత్తులలో ఉండే కఫాన్ని తొలగిస్తుంది. దీని వల్ల ఛాతి పట్టేయడం, ముక్కు దిబ్బడ వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. బ్రాంకైటిస్ తగ్గుతుంది. ఉల్లిపాయల టీ జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. అజీర్తిని తగ్గిస్తుంది. ఈ టీ ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. జీర్ణ సమస్యలు రాకుండా చేస్తుంది.

**ఎలా తయారు చేయాలి..?**

బీపీ ఉన్నవారికి ఉల్లిపాయల టీ ఎంతో మేలు చేస్తుంది. ఉల్లిపాయల్లో ఉండే క్వర్సెటిన్, సల్ఫర్ సమ్మేళనాలు రక్త నాళాలను ప్రశాంతంగా మారుస్తాయి. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఇక ఉల్లిపాయల టీని ఎలా తయారు చేయాలో చూద్దాం. ఇందుకు గాను 1 మీడియం సైజ్ ఉల్లిపాయ, 2 నుంచి 3 కప్పుల నీళ్లు, కొన్ని అల్లం ముక్కలు, 2 టీస్పూన్ల తేనె, కొద్దిగా నిమ్మరసం తీసుకోవాలి. ఉల్లిపాయను చిన్న ముక్కలుగా కట్ చేయాలి. పాత్రలో నీటిని పోసి అందులో ఉల్లిపాయ, అల్లం ముక్కలు వేసి నీటిని బాగా మరిగించాలి. స్టవ్‌ను సిమ్‌లో పెట్టి నీళ్లను 10 నుంచి 15 నిమిషాల పాటు మరిగించిన తరువాత ఆ నీళ్లను వడకట్టి అందులో తేనె, నిమ్మరసం కలపాలి. దీంతో ఉల్లిపాయల టీ రెడీ అవుతుంది. దీన్ని గోరు వెచ్చగా ఉన్నప్పుడు తాగేయాలి. ఈ టీని రోజూ ఒక కప్పు మోతాదులో తాగుతున్నా చాలు, అనేక లాభాలు కలుగుతాయి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
29 సెప్టెంబర్
2025



# జయహో!



## ఆసియాకప్ మనదే

## మ్యాచ్‌ను గెలిపించిన తెలుగు తేజం
## 146 పరుగులకే కుప్పకూలిన పాకిస్తాన్

**ఐదు వికెట్ల తేడాతో దాయాది దేశాన్ని మట్టి కరిపించిన టీమిండియా**



దుబాయ్, సెప్టెంబర్20: ఆసియా కప్ 2025 విజేతగా టీమిండియా ఆవిర్భవించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో పాకిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో స్కోరింగ్ టాస్ ఓడి, తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాక్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయ్యింది. భారత్ మరో 2 బంతులు మిగిలుండగా లక్ష్యాన్ని ఛేదించింది. తిలక్ వర్మ (69) అజేయ అర్ధ శతకంతో టీమిండియాను గెలిపించాడు.

**హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న తిలక్**

తిలక్ 41 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 50 పరుగులు పూర్తి చేసుకున్నాడు. 16 ఓవర్ల తర్వాత భారత్ స్కోర్ 111/4గా ఉంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలవాలంటే 24 బంతుల్లో 36 పరుగులు చేయాలి. 12.2వ ఓవర్- 77 పరుగుల వద్ద టీమిండియా నాలుగో వికెట్ కోల్పోయింది. అబ్రార్ అహ్మద్ బౌలింగ్‌లో ఫర్హాన్‌కు క్యాచ్ ఇచ్చి సంజూ శాంసన్ (24) ఔటయ్యాడు.

**ఆచితూచి ఆడుతున్న తిలక్, శాంసన్**

20 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన నేపథ్యంలో భారత బ్యాటర్లు తిలక్ వర్మ (24), సంజూ శాంసన్ (16) మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతున్నారు. 10 ఓవర్ల తర్వాత భారత స్కోర్ 58/3గా ఉంది. 147 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో టీమిండియా తడబడుతుంది. 20 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. గిల్ (12) మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. ఫహీమ్ అష్రఫ్ బౌలింగ్‌లో హారీస్ రౌఫ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. 147 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో టీమిండియా కష్టాల్లో పడింది. 10 పరుగులకే ఇన్ ఫామ్ బ్యాటర్ అభిషేక్ శర్మ (5), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (1) వికెట్లు కోల్పోయింది.

**చెలరేగిన కుల్దీప్.. 146 పరుగులకే కుప్పకూలిన పాకిస్తాన్**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాక్.. కుల్దీప్ యాదవ్ (4-0-30-4) ధాటికి 19.1 ఓవర్లలో 146 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు సాహిబ్‌జాదా ఫర్హాన్ (57), ఫకర్ జమాన్ (46) రాణించడంతో పాక్ తొలుత భారీ స్కోర్ చేసేలా కనిపించింది. 11.2 ఓవర్లలో కేవలం వికెట్ మాత్రమే కోల్పోయి 100 పరుగుల మార్కును తాకిన ఆ జట్టు.. భారత బౌలర్లు ఒక్కసారిగా లైన్‌లోకి రావడంతో తట్టుకోలేకపోయింది. 33 పరుగుల వ్యవధిలో ఆ జట్టు చివరి 9 వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్లలో కుల్దీప్‌తో పాటు అక్షర్ పటేల్ (4-0-26-2), వరుణ్ చక్రవర్తి (4-0-30-2), బుమ్రా (3.1-0-25-2) కూడా సత్తా చాటారు. పాక్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లతో పాటు వన్ డౌన్ బ్యాటర్ సైమ్ అయూబ్ (14) మాత్రమే రెండంకెల స్కోర్ చేశారు.

> **ఆసియా కప్ 2025 విజేత టీమిండియా**
>
> **మ్యాచ్‌ను గెలిపించిన తెలుగు తేజం**
> **146 పరుగులకే కుప్పకూలిన పాకిస్తాన్**
> **ఐదు వికెట్ల తేడాతో దాయాది దేశాన్ని మట్టి కరిపించిన టీమిండియా**

**చెలరేగిన కుల్దీప్**

ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో కుల్దీప్ యాదవ్ మూడు వికెట్లు తీసి పాక్‌ను కోలుకోలేని దెబ్బకొట్టాడు. తొలి బంతికి సల్మాన్ అఘా, నాలుగో బంతికి షాహీన్ అఫ్రిది (0), ఆఖరి బంతికి ఫహీమ్ అష్రాఫ్ (0) ఔటయ్యారు. 16 ఓవర్ల తర్వాత పాక్ స్కోర్ 134/8గా ఉంది. నవాజ్, హారీస్ రౌఫ్ క్రీజ్‌లో ఉన్నారు.

**ఆరో వికెట్ కోల్పోయిన పాక్**

16.1వ ఓవర్- 133 పరుగుల వద్ద పాక్ ఆరో వికెట్ కోల్పోయింది. అక్షర్ పటేల్ బౌలింగ్లో సంజూ శాంసన్ అద్భుతమైన క్యాచ్ పట్టడంతో సల్మాన్ అఘా (8) ఔటయ్యాడు.

**కష్టాల్లో పాకిస్తాన్**

పాక్ జట్టు మరోసారి కష్టాలో పడింది. తొలుత పరుగు వ్యవధిలో రెండు వికెట్లు కోల్పోయిన ఆ జట్టు.. ఈసారి 5 పరుగుల వ్యవధిలో మరో 2 వికెట్లు కోల్పోయింది. దీంతో పాక్ 15.3 ఓవర్లలో 132 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. సల్మాన్ అఘా (7), మొహమ్మద్ నవాజ్ (1) క్రీజ్‌లో ఉన్నారు. పరుగు వ్యవధిలో రెండు వికెట్లు (సైమ్ అయూబ్ (14), మొహమ్మద్ హారీస్ (0)) కోల్పోవడంతతో పాక్ స్కోర్ నెమ్మదించింది. 14 ఓవర్ల తర్వాత ఆ జట్టు స్కోర్ 118/3గా ఉంది. ఫకర్ జమాన్ (38), సల్మాన్ అఘా (3) క్రీజ్‌లో ఉన్నారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేస్తున్న పాక్ 11.2 ఓవర్లలోనే 100 పరుగులు (వికెట్ నష్టానికి) పూర్తి చేసుకుంది. 12 ఓవర్ల తర్వాత పాక్ స్కోర్ 107/1గా ఉంది. ఫకర్ జమాన్ (33), సైమ్ అయూబ్ (13) క్రీజ్‌లో ఉన్నారు.

**తొలి వికెట్ కోల్పోయిన పాక్**

9.4వ ఓవర్- 84 పరుగుల వద్ద పాక్ తొలి వికెట్ కోల్పోయింది. హాఫ్ సెంచరీ అనంతరం సాహిబ్‌జాదా ఫర్హాన్ (57) ఔటయ్యాడు. వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో తిలక్ వర్మ క్యాచ్ పట్టడంతో ఫర్హాన్ పెవిలియన్‌కు చేరాడు.

**ధాటిగా ఆడిన్ పాక్ ఓపెనర్లు.. ఫర్హాన్ హాఫ్ సెంచరీ**

తొలుత నిదానంగా ఆడిన పాక్ ఓపెనర్లు గేర్ మార్చారు. సాహిబ్‌జాదా ఫర్హాన్ 35 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. మరో ఓపెనర్ ఫకర్ జమాన్ 18 బంతుల్లో ఫోర్, సిక్సర్ సాయంతో 22 పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు. 9 ఓవర్ల తర్వాత పాక్ స్కోర్ 77/0గా ఉంది.

**జాగ్రత్తగా ఆడిన్ పాకిస్తాన్ ఓపెనర్లు**

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేస్తున్న పాకిస్తాన్ ఆచితూచి ఆడుతుంది. ఓపెనర్లు సాహిబ్‌జాదా ఫర్హాన్ (24), ఫకర్ జమాన్ (6) చాలా జాగ్రత్తగా ఆడుతున్నారు. 4 ఓవర్ల తర్వాత ఆ జట్టు స్కోర్ 32/0గా ఉంది. క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న భారత్, పాకిస్తాన్ ఆసియా కప్ 2025 ఫైనల్ మ్యాచ్ మరికొద్ది నిమిషాల్లో ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్నాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా సేవలను కోల్పోయింది. గాయం కారణంగా అతను ఈ మ్యాచ్‌లో ఆడటం లేదు. అతని స్థానంలో రింకూ సింగ్ తుది జట్టులోకి వచ్చాడు. గత మ్యాచ్ మిస్ అయిన శివమ్ దూబే, బుమ్రా జట్టులోకి రీఎంట్రీ ఇచ్చారు.

**తుది జట్లు..**

పాకిస్తాన్: సాహిబ్జాదా ఫర్హాన్, ఫఖర్ జమాన్, సైమ్ అయూబ్, సల్మాన్ అఘా(సి), హుస్సేన్ తలత్, మహ్మద్ హారీస్(డబ్ల్యూ), మహ్మద్ నవాజ్, ఫహీమ్ అష్రఫ్, షాహీన్ అఫ్రిది, హారీస్ రవూఫ్, అబ్రార్ అహ్మద్.

భారత్: అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్(సి), తిలక్ వర్మ, సంజు శాంసన్(w), శివమ్ దూబే, రింకూ సింగ్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి.



# విజయోత్సాహం

**జాతీయ జెండాతో యువతుల నృత్యం**

హైదరాబాద్, సెప్టెంబర్29: ఉత్కంఠంగా సాగిన ఆసియా క్రికెట్ కప్ ఫైనల్ మ్యాచ్ లో టీమిండియా గెలుపుపై సర్వత్రా విజయోత్సవాలు జరుపుకొన్నారు. గెలుపు సందర్భంగా కరీంనగర్ మహా శక్తి ఆలయ ప్రాంగణంలో మహిళలు, యువతులు దాండియా ఆడుతూ ఆనందంతో త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించారు. దీనికి చూసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఆనందంతో చప్పట్లు కొట్టారు. టీమిండియాకు అభినందనలు తెలిపారు.






# బీసీసీఐ కొత్త అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్

**రోజర్ బిన్నీ స్థానంలో మిథున్ మన్హాస్ ఏకగ్రీవంగా ఎన్నిక**

**వార్షిక సర్వసభ్య సమావేశంలో కీలక నిర్ణయం**

**అధ్యక్ష పదవి చేపట్టిన మూడో మాజీ క్రికెటర్‌గా గుర్తింపు**

**మరోసారి వైస్ ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా**



భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నూతన అధ్యక్షుడిగా మాజీ క్రికెటర్ మిథున్ మన్హాస్ ఎన్నికయ్యారు. ఆదివారం బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన వార్షిక సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) ఈ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. సౌరవ్ గంగూలీ, రోజర్ బిన్నీల తర్వాత ఈ అత్యున్నత పదవిని అలంకరించిన మూడో మాజీ క్రికెటర్‌గా 45 ఏళ్ల మన్హాస్ నిలిచారు. గత ఆగస్టు నెలలో రోజర్ బిన్నీ తన పదవికి రాజీనామా చేయడంతో బీసీసీఐ అధ్యక్ష పదవి ఖాళీ అయింది. అప్పటి నుంచి రాజీవ్ శుక్లా తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మిథున్ మన్హాస్ పేరును జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ (జేకేసీఏ) నామినేట్ చేసింది. అతడి పేరు అనూహ్య రీతిలో తెరపైకి వచ్చింది. ఇటీవల బోర్డు సమావేశం అనంతరమే మిథున్ మన్హాస్ కూడా ఈ రేసులోకి వచ్చాడు. తాజాగా ఏజీఎంలో ఆయన ఎన్నికను ఖరారు చేశారు. ఇదే సమావేశంలో ఇతర కీలక పదవులకు కూడా ఎన్నికలు జరిగాయి. సమాచారం ప్రకారం, వైస్ ప్రెసిడెంట్‌గా రాజీవ్ శుక్లా, కార్యదర్శిగా దేవాజిత్ సైకియా తమ పదవులను నిలబెట్టుకున్నారు. సంయుక్త కార్యదర్శిగా ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా, కోశాధికారిగా రఘురామ్ భట్ కొత్తగా ఎన్నికయ్యారు. మిథున్ మన్హాస్ నియామకంపై కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా హర్షం వ్యక్తం చేశారు. "ఇది ఒక చారిత్రక సందర్భం! జమ్మూకశ్మీర్‌లోని మారుమూల ప్రాంతమైన దోడా జిల్లాకు చెందిన మిథున్ మన్హాస్ బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నికవడం గర్వకారణం" అని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీ తరఫున దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు ఉన్న మన్హాస్, ఆ తర్వాత జమ్మూకశ్మీర్ జట్టుకు కూడా ప్రాతినిధ్యం వహించి కోచ్‌గా సేవలు అందించారు. తన కెరీర్‌లో 147 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు ఆడి 9,714 పరుగులు చేశారు. ఐపీఎల్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్, పుణె వారియర్స్ ఇండియా, చెన్నై సూపర్ కింగ్స్ జట్లకు ఆడారు. క్షేత్రస్థాయిలో క్రికెట్‌పై ఉన్న అవగాహన, సౌమ్యుడిగా పేరున్న మన్హాస్ నియామకం భారత క్రికెట్‌కు మేలు చేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



## ఓజీ హీరోయిన్.. వాటికి రెడీ కాదా..?

హీరోయిన్స్ అందరు ఒకేలా ఉండాలని రూల్ ఏమి లేదు. ముఖ్యంగా సినిమాల ఎంపిక.. పాత్రల విధానం ఎవరికి వారు ఇష్టంగా చేస్తుంటారు. అవకాశం వస్తే చాలు ఎలాంటి రోల్స్ చేయడానికైనా రెడీ అనే వాళ్లు ఉంటారు. తనకు నచ్చిన రోల్ తప్ప మరే ఛాన్స్ అది స్టార్ సినిమా ఐనా ఎక్కువ రెమ్యునరేషన్ ఇచ్చినా చేయకూడదని ఫిక్స్ అయ్యే వాళ్లు ఉన్నారు. ఈ క్రమంలో కొందరు హీరోయిన్స్ కేవలం తమ నటనతోనే ఆడియన్స్ ని మెప్పించాలని చూస్తారు. అలాంటి వారిలో ప్రియాంక మోహన్ ఒకరు. ఈ చెన్నై చిన్నది తమిళ్ లో సినిమాలు చేస్తూ నాని గ్యాంగ్ లీడర్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా ఓకే అనిపించుకోగా నెక్ట్స్ శర్వానంద్ తో శ్రీకారం చేసింది. అది నిరాశపరచింది. ఐతే ఆఫ్టర్ గ్యాప్ నానితోనే సరిపోదా శనివారం సినిమా చేసింది ప్రియాంక. ఇక రీసెంట్ గా ఓజీలో కన్మణి రోల్ లో ఇంప్రెస్ చేసింది. లెంగ్త్ చాలా తక్కువ ఉన్నా కూడా తన రోల్ లో ఆడియన్స్ ని ఆకట్టుకుంది అమ్మడు. ఐతే ఓజీ హీరోయిన్ కెరీర్ ని అబ్జర్వ్ చేస్తే మన పక్కింటి అమ్మాయి లాంటి పాత్రలను మాత్రమే చేస్తుంది. పాత్రల ఎంపికలో ప్రియాంక చాలా సెలెక్టెడ్ గా ఉంటుంది. దానికి రీజన్ అంటూ ఏమి లేదు. తనకు ఇలాంటి పాత్రలే ఇష్టం.. ఇలాంటి రోల్స్ మాత్రమే చేస్తా అనేలా ఒక స్ట్రిక్ట్ కండీషన్స్ పెట్టుకుంది. గ్లామర్ షోకి అమ్మడు ఆమడం దూరంలో ఉంటుంది. కొందరు సినిమాల్లో గ్లామర్ షో చేయరు ఫోటో షూట్స్ తో సరిపెడతారు. కానీ ప్రియాంక అలా ఫోటో షూట్స్ లో కూడా స్కిన్ షో చేయడానికి ఇష్టపడదు. సాయి పల్లవి తర్వాత విత్అౌట్ గ్లామర్ రోల్స్ చేస్తూ వస్తుంది ప్రియాంక. ఐతే ఆమె అంత క్రేజ్ తెచ్చుకోలేదు కానీ ప్రియాంకాకు కూడా తెలుగు, తమిళ్ లో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడుతుంది. ఓజీ చూశాక ఆమె మీద కూడా తెలుగు ఆడియన్స్ స్పెషల్ ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. మరి ప్రియాంక ఎప్పుడు ఇలానే ఉంటుందా లేదా కెరీర్ రిస్క్ లో ఉందని గ్లామర్ రోల్స్ కి టర్న్ అవుతుందా అన్నది చూడాలి. పవర్ స్టార్ తో జత కట్టిన తర్వాత అమ్మడి కెరీర్ స్పీడ్ అందుకోకపోతే ఎలా.. ఆల్రెడీ తెలుగులోనే రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నాయని టాక్. తమిళ్ లో కూడా ప్రియాంక తన ఫాం కొనసాగిస్తుంది.

## నేను విన్న ఆ కథలతో సినిమా తెరకెక్కిస్తారనుకోలేదు : ఎన్టీఆర్



తాను చిన్నప్పుడు విన్న కథలతో సినిమా రూపొందుతుందని అనుకోలేదని, అలా తెరకెక్కిన మూవీ విజయం అందుకుందంటూ 'కాంతార' గురించి మాట్లాడారు ప్రముఖ నటుడు ఎన్టీఆర్ ఆ సినిమాకి ప్రీక్వెల్గా రూపొందిన 'కాంతార చాప్టర్ 1' ప్రీ రిలీజ్ ఈవెంట్కు ముఖ్య అతిథిగా హాజరై, సందడి చేశారు. స్వీయ దర్శకత్వంలో కన్నడ నటుడు రిషబ్ శెట్టి తెరకెక్కించిన చిత్రమిది. రుక్మిణీ వసంత్ హీరోయిన్. ఈ సినిమా అక్టోబరు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా జె.ఆర్.సి. కన్వెన్షన్లో ఈవెంట్ నిర్వహించారు. ఎన్టీఆర్ మాట్లాడుతూ.. "దాదాపు నాకు మూడేళ్ల వయసున్నప్పుడు.. అమ్మమ్మ కుందాపుర సమీపంలోనే మన ఊరు అని చెప్పేది. దానికి సంబంధించిన కథలు చెప్పేది. అవన్నీ నాకు నచ్చేవి. 'ఇలా నిజంగానే జరుగుతుందా? అని నాకెన్నో సందేహాలొచ్చేవి. "గుళిగ, పంజుర్లి గురించి తెలుసుకోవాలనిపించేది. నేను విన్న ఆ కథలతో ఓ దర్శకుడు సినిమా తెరకెక్కిస్తాడని అనుకోలేదు. నా సోదరుడు రిషబశెట్టి దాన్ని సాధ్యం చేశాడు. నేను బాల్యంలో విన్న కథలను తెరపై చూసి ఆశ్చర్యపోయా, దాని గురించి మాటల్లో చెప్పలేను. కథ తెలిసి నేనే ఇలా అయిపోతే.. కొత్తగా తెలుసుకున్న వారు ఏమయ్యారో అదే 'కాంతార ఫలితం" అని అన్నారు. "రిషబ్.. అరుదైన దర్శకుడు, నటుడు, ఆయనలోని నటుడిని దర్శకుడు, డైరెక్టర్ను యాక్టర్ డామినేట్ చేయడం కాదు.. 24 విభాగాలను డామినేట్ చేస్తారు. 'కాంతార'ను ఈ స్థాయిలో తెరకెక్కించడం మరెవరి వల్ల సాధ్యమయ్యేది కాదు. మా అమ్మను ఉడుపి కృష్ణుడి ఆలయానికి తీసుకెళ్లాలనేది ఎప్పటి నుంచో నా కోరిక. రిషబ్ వల్ల ఆ దర్శన భాగ్యం దక్కింది. తమ పనుల్నీ పక్కన పెట్టి రిషబ్ కుటుంబం మాతో కలిసి వచ్చింది. నన్ను కుటుంబ సభ్యుడిగా చూసుకున్నారు. ఆ సమయంలోనే.. ఆయన 'కాంతార చాప్టర్ 1' కోసం ఎంత కష్టపడుతున్నారో అర్థమైంది. ఈ చిత్రాన్ని తెరకెక్కించడం అనుకున్నంత తేలిక కాదు" అని పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం ఎన్టీఆర్కు స్వల్ప గాయమైన సంగతి తెలిసిందే. అందుకే ఇంతకుముందులా గట్టిగా మాట్లాడలేనని, అర్థం చేసుకోవాలని తన ప్రసంగానికి ముందు అభిమానులకు విజ్ఞప్తి చేశారు.



## జాన్వీ కపూర్ మూవీకి ఎదురుదెబ్బ..

ప్రముఖ బాలీవుడ్ స్టార్ హీరోయిన్ జాన్వీకపూర్ తాజాగా నటించిన చిత్రం హెూమ్ బౌండ్. నీరజ్ ఘయ్వాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో విశాల్ జెత్వా , ఇషాన్ ఖట్టర్, జాన్వి కపూర్ ప్రధాన పాత్రలు పోషించారు. హిందీ భాషా చిత్రంగా విడుదలైన ఈ సినిమా ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిలిం విభాగంలో ఏకంగా భారతదేశము నుండి అధికారిక ఆస్కార్ కు ఎంట్రీ కూడా అందుకుంది. దీంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ముఖ్యంగా ఆస్కార్ కి ఎంపికైంది అంటే.. కచ్చితంగా ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ కొడుతుందని.. కలెక్షన్లతో రికార్డ్స్ తిరగా రాస్తుందని అందరూ ఫిక్స్ అయిపోయారు. దీనికి తోడు నిన్న థియేటర్లోకి వచ్చిన ఈ సినిమా విమర్శకుల నుండి ప్రశంసలు కూడా అందుకుంది. కానీ మొదటి రోజు కలెక్షన్లు మాత్రం భారీగా దెబ్బ కొట్టినట్లు కనిపిస్తోంది. తాజాగా ట్రేడ్ నివేదికల ప్రకారం హెూమ్ బౌండ్ మొదటి రోజు కేవలం రూ.30లక్షల నికర వసూలు మాత్రమే రాబట్టినట్లు సమాచారం. దీనికి కారణం ఈ సినిమా గురించి పెద్దగా ప్రమోషన్స్ చేపట్టకపోవడమే అని తెలుస్తోంది. ఇందులో ప్రముఖ నటులు నటించినప్పటికీ సరైన ప్రమోషన్ కార్యక్రమాలు చేపట్టకపోవడం వల్లే.. ఈ సినిమా ప్రజలకు పెద్దగా తెలియక ఓపెనింగ్స్ పేలవంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ఆస్కార్ ప్రదర్శనకు ఎంపికైన ఈ చిత్రం ఇప్పుడు ఇలా కలెక్షన్లు రాబట్ట లేకపోవడం నిజంగా ఆశ్చర్యకరమని చెప్పాలి. హెూమ్ బౌండ్ మూవీను ఇదివరకే కేన్స్ ఫిలిం ఫెస్టివల్ లో ప్రపంచ ప్రీమియర్ ను ప్రదర్శించిన విషయం తెలిసిందే. అటు టొరంటో అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్లో కూడా ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ హెూమ్ బౌండ్ అనే సినిమా జర్నలిస్ట్ బషరత్ పీర్ రాసిన 'ఏ ఫ్రెండ్షిప్, ఏ పాండమిక్ అండ్ ఎ ద్వాత్ డిసైడ్ ది హైవే ' అనే వ్యాసం నుండి ప్రేరణ పొంది దీనిని తెరకెక్కించడం జరిగింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఒక ముస్లిం, దళితుడి మధ్య బాల్య స్నేహాన్ని ప్రదర్శిస్తుంది. వీరిద్దరూ తమ ఇంటి పేర్ల కారణంగా చాలా కాలంగా తిరస్కరించబడిన గౌరవాన్ని.. తిరిగి పోలీసు ఉద్యోగం ద్వారా పొందగలుగుతారు. హాలీవుడ్ లెజెండ్ మార్టిన్ కోర్సెస్ ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించగా కరణ్ జోహార్, అదార్ పూనవల్ల ఈ చిత్రానికి నిర్మాణంలో సహాయం అందించారు.



## అఖిల్.. నెక్ట్స్ బిగ్ స్క్రీన్ పై దర్శనమిచ్చేదెప్పుడు?

అయ్యగారు.. అదేనండీ టాలీవుడ్ యంగ్ హీరో అఖిల్.. అక్కినేని నాగార్జున వారసుడిగా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి ఇప్పటికే పలు సినిమాల్లో నటించారు. కానీ కెరీర్ లో పెద్ద హిట్ కోసం వెయిట్ చేస్తున్నారు. రెండేళ్ల కిందట ఏజెంట్ మూవీతో వచ్చి డిజాస్టర్ అందుకున్న అఖిల్.. ఇప్పుడు లెనిన్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. రీసెంట్ గా వివాహ బంధంలోకి అడుగుపెట్టిన అఖిల్.. ఇప్పుడు మళ్ళీ తన అప్ కమింగ్ ప్రాజెక్ట్ లెనిన్ పై ఫోకస్ పెట్టారు. ఇప్పుడు ఆ సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్ చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే 80 శాతం షూటింగ్ కంప్లీట్ అయినట్లు తెలుస్తోంది. మరో 20 శాతాన్ని శరవేగంగా పూర్తి చేయాలని మేకర్స్ ఫిక్స్ అయ్యారట. ఆ వెంటనే పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరపనున్నారని సమాచారం. అయితే ఇప్పుడు లెనిన్ మూవీ.. నవంబర్ 17వ తేదీన వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేయనున్నారని టాక్ వినిపిస్తోంది. త్వరలోనే మేకర్స్ అఫిషియల్ గా అనౌన్స్ చేయనున్నారని ప్రచారం జరుగుతోంది. అప్పుడే ప్రమోషన్స్ కూడా మొదలు పెట్టనున్నారని వినికిడి. అయితే లెనిన్ సినిమా విషయానికొస్తే.. వినరో భాగ్యం విష్ణు కథ ఫేమ్ మురళి కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై యంగ్ ప్రొడ్యూసర్ సూర్యదేవర నాగ వంశీ నిర్మిస్తున్నారు. నాగార్జున అక్కినేని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ తో సహ భాగస్వామిగా ఉన్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు.

ఇప్పటికే టైటిల్ గ్లింప్స్ ను మేకర్స్ రిలీజ్ చేయగా.. ఆడియెన్స్ నుంచి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. అఖిల్.. పూర్తిగా రగ్గడ్ లుక్ లో నెవ్వర్ బిఫోర్ అనేలా కనిపించారు. మొదట్లో మైథాలజీని జోడించి గ్లింప్స్ వీడియోను మేకర్స్ కట్ చేయగా.. సినీ ప్రియులతోపాటు అక్కినేని అభిమానుల్లో మంచి బజ్ నెలకొంది. అయితే గ్లింప్స్ అఖిల్ సరసన యంగ్ బ్యూటీ శ్రీలీల నటిస్తున్నట్టు మేకర్స్ అనౌన్స్ చేసిన సంగతి విదితమే. ఆమెను హాఫ్ శారీలో క్యూట్ గా చూపించారు. కానీ ఇప్పుడు శ్రీలీల బదులు క్రేజీ హీరోయిన్ భాగశ్రీ బోర్సె అఖిల్ కు జోడీగా నటిస్తున్నట్లు సమాచారం. డేట్స్ విషయంలో ఇబ్బంది వస్తుండడంతో భాగ్యశ్రీని సెలెక్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు శ్రీలీలతో ఎనిమిది రోజుల చిత్రీకరణ మాత్రమే నిర్వహించారు మేకర్స్. ఆ సన్నివేశాలను భాగ్యశ్రీతో తిరిగి చిత్రీకరించాల్సి వచ్చింది. కాస్త డబుల్ వర్క్ అయినా.. నిర్మాణం వేగంగా ముందుకు సాగుతున్నట్లు వినికిడి. దీంతో అఖిల్ సహా మూవీ టీమ్.. లెనిన్ పై ఎంత ఫోకస్ పెట్టారో క్లియర్ గా తెలుస్తోంది. మరి లెనిన్ మూవీతో అఖిల్ ఎలాంటి సక్సెస్ అందుకుంటారో వేచి చూడాలి.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986